
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY
గుంటూరు జిల్లా వార్తలు
గురువారం 3 ఏప్రిల్ 2025



5

ఎండీయూ వాహనాల వద్దే ఈకేవైసీ
- రేషన్ షాపుల వద్ద కొలిక్కిరాని ప్రక్రియ
- మూడు జిల్లాల్లో 5 లక్షల పైచిలుకు పెండింగ్
- నెలాఖరు వరకూ గడువు పొడిగింపు..
- ఆ లోగా పూర్తి కాకుంటే రేషన్ కట్..
- ఈ నెల కూడా కనిపించని కందిపప్పు



8

ఉపాధితో.. వలసలకు.. కళ్లెం

- వేసవి వలసల నివారణకు చర్యలు
- మూడు జిల్లాల్లో 1.85 కోట్ల పనిదినాలు
- రోజు కూలి రూ. 300గా ప్రకటన
- ఐదు రకాల పనులకు ప్రాధాన్యం

వేసవిలో వలసల నివారణకు అధికారులు చర్యలు చేపడుతున్నారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా పనులు కల్పించనున్నారు. పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల వారీగా ఉపాధి పనులకు ప్రణాళికలను సిద్ధం చేశారు. మూడు జిల్లాల్లో 1.85 కోట్ల పనిదినాలు కల్పించనున్నారు. గత ఏడాది చేసిన పని దినాలను పరిగణనలోకి తీసుకుని ఈ ఏడాది పని దినాలను రూపొందించారు. ఏడాది మొత్తంలో నెలల వారీగా ఏ నెలలో ఎన్ని పని దినాలు కల్పించాలన్న నివేదికను సిద్ధం చేశారు. పని దినాలను లక్ష్యాల మేర పూర్తి చేసేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. పల్లెల్లో పెద్ద ఎత్తున పనులు చేపట్టనున్నారు.



నరసరావుపేట : ఉపాధి పనుల్లో కూలీలు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

ఉపాధి హామీ పథకం పల్లెలకు ప్రగతి బాటలు వేస్తోంది. పథకంలో పేరు నమోదు చేసుకున్న ప్రతి కూలీకి వంద రోజులు పనిదినాలు కల్పించే దిశగా అధికారులు చర్యలు చేపడుతున్నారు. ఇప్పటికే పంచాయతీల వారీగా పనులను గుర్తించారు. ప్రతి కూలీకి కనీస వేతనం రూ. 300గా కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో పనులకు వచ్చే కూలీల సంఖ్య పెరుగుతోంది. నీటి సంరక్షణ, నీటి నిల్వలో భాగంగా వాగులు వంకలు, కుంటలు చెరువులు, చెక్ డ్యామ్‌ల్లో పూడికతీత పనులతో పాటు ఊట కుంటలు, పంట నీటి కుంటలు, ఇంకుడు గుంతలు, రహదారుల నిర్మాణం, రైతుల పొలాల్లో ఉద్యాన పండ్లతోటల సాగు, మొక్కల నాటడం వంటి పనులు చేపట్టనున్నారు.

జిల్లా	పని దినాలు
పల్నాడు	74,77,946
గుంటూరు	34,20,809
బాపట్ల	76,56,945

పల్నాడు జిల్లాలో జాబ్ కార్డుల 3.4 లక్షలు జారీ చేశారు. 5.84 లక్షల మంది కూలీలు ఉన్నారు. యాక్టివ్ జాబ్ కార్డులు 2.51 లక్షలు కాగా 4.27లక్షల మంది కూలీలు పనులకు హాజరవుతున్నారు. బాపట్ల జిల్లాలో 2.69 లక్షల జాబ్ కార్డులు జారీ చేశారు. 4.75 లక్షల మంది కూలీలను నమో దు చేశారు. 2.05లక్షల జాబ్ కార్డులు యాక్టివ్‌గా ఉన్నాయి. 3.58 లక్షల మంది కూలీలు పనులకు హాజరవు తున్నారు. గుంటూరు జిల్లాలో 1.26 లక్షల జాబ్ కార్డులు ఉన్నాయి. 2.10 లక్షల మంది కూలీలు ఉన్నారు. యాక్టివ్ జాబ్ కార్డులు 91,815 ఉన్నాయి. 1,44,399 మంది కూలీలు పనులకు హాజరవుతున్నారు.

డ్వామా శాఖ ఇందుకు సంబంధించిన ప్రణాళికను విడుదల చేసింది. రానున్న మూడు నెలల్లో చేపట్టే పనుల జాబితాను రూపొందించింది. ఐదు రకాల పనులకు ప్రాధాన్యం కల్పించారు. పనులు వివరాలు ఇలా ఉన్నాయి. పశువులు గుంపుగా చేరుటకు అనువుగా ఉన్న ప్రదేశమలో నీటి తొట్లలను నిర్మిస్తారు. ఈ పనులను 1న ప్రారంభించారు. ఈ నెల 10 కల్లా పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్దేశించారు.

పల్నాడు జిల్లాలో 14,000 సేద్యపు నీటి కుంటలను నిర్మించాలన్న లక్ష్యాన్ని ప్రభుత్వం నిర్దేశించింది. గుంటూరు జిల్లాలో 8,500, బాపట్ల జిల్లాలో 9,500 సేద్యపు నీటి కుంటల నిర్మాణ లక్ష్యంగా నిర్ణయించారు. లక్ష్యం మేరకు పూర్తి చేయడం. త్వరితగతిన ఇన్లెట్, అవుట్ లెట్, సిల్ట్ ట్రాప్ పనులను పూర్తి చేయనున్నారు.

పంట కాలువ.. ఫీడర్.. సప్లై ఛానల్ పనులు అవసరాన్ని బట్టి పనులు చేయనున్నారు. 3 సంవత్సరాల కాల వ్యవధి పాటించడం. కూలీలకు పూర్తి దినసరి వేతనం రూ. 300 తగినట్లు మార్కింగ్ ఇచ్చి పని చేయించడం. వర్షాకాలం వచ్చే లోపు పంటకాలువ పనులను పూర్తిచేయనున్నారు. విస్తృత స్థాయిలో కూలీలకు పని కల్పించడం. చెరువు.. కుంటలను వాటి అసలు సామర్థ్యం వుండే విధంగా పునరుద్ధరించడం. మట్టి గుంతలను చెరువు కట్ట అడుగు నుండి కట్టఎత్తు కంటే పది రెట్ల దూరం తరువాత తవ్వడం. గ్రూపులు.. కూలీల సంఖ్య ఆధారంగా పూడిక గుంతల కొలతలు కేటాయిస్తారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి ప్రకటించిన దినసరి వేతన రేటు రూ. 300 ప్రతి ఒక్కరు పొందే విధంగా ఆయా పనులకు సంబంధించిన ఖచ్చితమైన పని కల్పించే విధంగా మేట్లు శ్రద్ధ వహించాలి. ప్రతి శుక్రవారం రోజ్ గార్ దివస్ సందర్భంగా కూలీలకు ఆయా పనులకు సంబంధించిన దినసరి వేతనంపై ఎప్పటికప్పుడు ఖచ్చితమైనఅవగాహన కల్పిస్తున్నారు.

నేటి నుంచి జూనియర్ కళాశాలలు
పునఃప్రారంభం

- 22 వరకు సీనియర్ ఇంటర్ తరగతులు
- 25 వరకు కళాశాల వసతిగృహాల నిర్వహణ
- విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్స్ పంపిణీ



గుంటూరు(విద్య), ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ఇటీవల ఇంటర్ మీడియట్ విద్యార్థులకు పరీక్షలు ముగిశాయి. పరీక్షల అనంతరం నుంచి విద్యార్థులకు సెలవులు ఇచ్చారు. ఈ పరిస్థితుల్లో సీనియర్ ఇంటర్ తరగతులను గురువారం నుంచి ప్రారంభించేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. దీంతో ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో సీనియర్ ఇంటర్ తరగతులు పునః ప్రారంభమవుతున్నాయి. ఈ నెల 22 వ తేదీ వరకు సీనియర్ ఇంటర్ తరగతులు నిర్వహించేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఈ క్రమంలో ప్రథమ సంవత్సరం పరీక్షలు రాసి ద్వితీయ సంవత్సరంలోకి రానున్న విద్యార్థులు తప్పని సరిగా కళాశాలలకు రావాలని ఇప్పటికే ప్రిన్సిపల్స్ నుంచి సందేశాలు అందాయి. ఉమ్మడి గుంటూరు జిల్లాలో దాదాపు 65 వేల మంది విద్యార్థులు ఇంటర్ విద్యను అభ్యసిస్తున్నారు. మార్చిలో జరిగిన పరీక్షలు పూర్తి చేసుకుని ఇప్పటికే విద్యార్థులు సెలవుల్లో ఉన్నారు. తాజాగా తరగతుల ప్రారంభానికి అనుమతిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంతో వారంతా తిరిగి కళాశాలలకు రావాల్సిన పరిస్థితి నెలకొంది. ద్వితీయ సంవత్సరంలో కనీసం రెండు మూడు యూనిట్లు పూర్తి చేయాలని ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. దీంతో విద్యార్థులను కళాశాలకు రప్పించేందుకు ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ కళాశాలల హాస్టళ్లలో ఈ నెల 25 వరకు ఇంటర్ విద్యార్థులకు వసతి కల్పిస్తారని ప్రిన్సిపల్స్ చెబుతున్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లోని విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు, రికార్డులు పంపిణీ చేసేందుకు అధ్యాపకులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే అవి కళాశాలలకు వచ్చాయని, విద్యార్థులు తరగతులకు హాజరుకాగానే వాటిని పంపిణీ చేస్తామని ప్రిన్సిపల్స్ వెల్లడించారు.

మండే ఎండల్లో తరగతులా?

ఇదిలా ఉంటే ఇప్పటికే ఎండలు మండిపోతున్నాయి. మధ్యాహ్న సమయంలో ఇళ్ల నుంచి బయటకు అడుగు పెట్టవద్దని ప్రభుత్వమే సూచిస్తోంది. ఈ పరిస్థితుల్లో జూనియర్ కళాశాలలు ప్రారంభం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. పైగా విద్యార్థులు కళాశాలకు తప్పనిసరిగా రావాలని ఆదేశించడంతో పిల్లల పరిస్థితి ఏమిటని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. కనీసం ఒక్కపూటైనా తరగతులు నిర్వహించి మధ్యాహ్నం నుంచి సెలవు ఇవ్వాలని కోరుతున్నారు. అయితే ప్రభుత్వం వారి అభ్యర్థనను పట్టించుకోకుండా ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు తరగతులు నిర్వహించాల్సిందేనని ఇంటర్ బోర్డు నుంచి ఒత్తిడి వస్తోంది.



70 కాదు.. 140 మీటర్లు

దేశంలోనే అతిపెద్దగా అమరావతి ఓఆర్ఆర్

దేశంలోనే అతిపెద్దదిగా.. రాజధాని నగర అభివృద్ధిలో కీలక ప్రాజెక్టుగా.. అద్భుతంగా.. సబర్బన్ రైళ్ల మార్గంతో.. పది వరుసల్లో.. లోపల, వెలుపలి వైపు సర్వీసు రోడ్డుతో.. ఔటర్ రింగురోడ్డు 140 మీటర్ల వెడల్పుతో అమరావతికి ఓ మణిహారంగా నిర్మాణం కానున్నది. గతంలో 70 మీటర్లకు పరిమితం చేసిన కేంద్రం తాజాగా దానిని 140 మీటర్లకు పెంచుతూ ఆమోదం తెలిపింది. రాజధానికి మెరుగైన కనెక్టివిటీ, రహదారి వెంబడి వచ్చే కారిడార్ల ఏర్పాటుతో జరిగే ఆర్థిక, పారిశ్రామికాభివృద్ధితో అమరావతి నగర విస్తరణను తనదాకా నడిపించడంలో ఈ ఓఆర్ఆర్ పెద్ద ఆకర్షణశక్తిగా పనిచేయనున్నది. భవిష్యత్‌లో అమరావతి నగర ప్రజల జీవన ప్రమాణాల తాలూకు నాణ్యతను బాగా మెరుగుపరచడంలో కూడా ఈ ఓఆర్ఆర్ కీలకపాత్ర పోషించనుంది.

- ఫలించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడి కృషి
- 189.4 కిమీల భూసేకరణకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం
- మూడు దశల్లో.. మూడేళ్లలోపు పూర్తిచేసేలా కాలపరిమితి

(ఆంధ్రజ్యోతి, మంగళగిరి)

అమరావతి చుట్టూ ఔటర్‌రింగురోడ్డును దేశంలో కెల్లా అతిపెద్దదిగా నిర్మించాలనుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు ఆలోచనలు అనుకున్న ప్రకారమే కార్యరూపం దాల్చుతున్నాయి. ఔటర్‌రింగు రోడ్డును 189.4 కి.మీ.ల పొడవునా 150 మీటర్ల వెడల్పుతో ఏర్పాటు చేయాలన్న చంద్రబాబు పట్టుదల ముందు కేంద్రం తలొగ్గింది. గత ఫిబ్రవరిలో ఓఆర్ఆర్ వెడల్పును 70మీటర్లకు పరిమితం చేస్తూ కేంద్ర ఉపరితల రవాణా మంత్రిత్వశాఖ నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. ఆరు వరుసల రహదారిగా నిర్మించాలని, లోపలి వైపున మాత్రమే సర్వీసు రోడ్డును నిర్మిస్తే సరిపోతుందని కేంద్ర ఉపరితల రవాణా మంత్రిత్వశాఖ నిర్ణయించింది. ఈ మేరకు భూసేకరణను 70 మీటర్లకు పరిమితం చేయొచ్చని గత నెలలో నిర్ణయించి రూ.16,310 కోట్లు ఖర్చు కాగలదని అంచనా వేసింది. అయితే ఇది ఎంతమాత్రం కుదరదని వెడల్పు ఆది నుంచి అనుకుంటున్న విధంగా 150 మీటర్ల ఉండాల్సిందేనంటూ సీఎం చంద్రబాబు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి స్పష్టం చేస్తూ ఇటీవల లేఖ రాశారు. దీంతో 140 మీటర్ల వెడల్పుతో అమరావతి ఓఆర్ఆర్ పేరిట 189.4 కి.మీ.లకు భూసేకరణకు కేంద్ర ఉపరితల రవాణా మంత్రిత్వశాఖ ఎట్టకేలకు ఆమోదం తెలిపింది. అమరావతి ఓఆర్ఆర్ నిర్మాణానికి సంబంధించి భూసేకరణపై ఏర్పడిన ప్రతిష్ఠంభన చిట్టచివరికి తొలగిపోవడంతో త్వరలోనే టెండర్లను కేంద్రం ఆహ్వానించే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఓ వైపు రాజధాని అమరావతి నిర్మాణ పనులు జోరందుకుంటున్న నేపథ్యంలో వాటికి సమాంతరంగా ఔటర్ రింగు రోడ్డు పనులను కూడా ప్రారంభించాలని చంద్రబాబు పట్టుదలగా ఉన్నారు. రాజధాని నిర్మాణ పనులను వచ్చే మూడేళ్లలోగా పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్న నేపథ్యంలో ఓఆర్ఆర్‌ను కూడా మూడు దశల్లో మొత్తం మూడేళ్లలోపుగా పూర్తి చేసేలా కాలపరిమితి సీఎం చంద్రబాబు నిర్దేశించుకున్నారు. నిజానికి గత నెలలో ఓఆర్ఆర్ తాలూకు భూసేకరణ విషయంలో పడిన పీటముడి వీడడానికి మరింత సమయం పట్టవచ్చునన్న ఊహాగానాలను పటాపంచలు చేస్తూ యుద్ధప్రాతిపదికన 140 మీటర్ల వెడల్పున భూసేకరణ చేసేలా కేంద్రాన్ని రాష్ట్రప్రభుత్వం ఒప్పించగలిగింది.

రూ.20 వేల కోట్లకు పెరగనున్న అంచనా వ్యయం

అమరావతి ఓఆర్ఆర్ ప్రాజెక్టు వ్యయం పెరగనుంది. గతంలో ప్రకటించిన విధంగా రూ.16310 కోట్లకు బదులు మరికొంత పెరిగే అవకాశం కనిపిస్తుంది. గతంలో సివిల్ వర్కుల అంచనా వ్యయాన్ని రూ.12,955 కోట్లుగా నిర్ణయించగా తాజాగా ఓఆర్ఆర్‌కు వెలుపలి వైపు కూడా సర్వీసు రోడ్డును నిర్మించాలని ప్రతిపాదించడంతో వ్యయం మరో రూ.500 కోట్లకుపైగా పెరిగే అవకాశం ఉంది. అలాగే భూసేకరణ వ్యయం దాదాపు రెట్టింపవనున్నది. 70 మీటర్ల వెడల్పుతో ఓఆర్ఆర్ నిర్మాణం చేయాలనుకున్నపుడు 4,220 ఎకరాలు సరిపోతుందని భావించి వ్యయం రూ.2,665 కోట్లుగా (మిగతా 6వ పేజీలో)

చక్రం తిప్పిన చంద్రబాబు



అమరావతి ఓఆర్ఆర్ 70 మీటర్లు.. ఆరు వరుసలతో సరిపోతుంద ని కేంద్రం గత నెలలో నిర్ణ యించింది. అయితే భవిష్యత్తులో పది వరసలకు పెంచాల్సి వస్తుందని.. లోపల, వెలుపలి వైపు సర్వీసు రోడ్డు నిర్మాణం జరిగితేనే ఔటర్‌కు బాహ్యంగా ఉన్న ప్రాంతాల అభివృద్ధి జరుగుతుందని.. ఓఆర్ఆర్ వెంటే సబర్బన్ రైల్వేలైను నిర్మించాలన్న ప్రతిపాదనలు తమ వద్ద ఉన్నాయని సీఎం చంద్రబాబు కేంద్రానికి వివరించారు. ప్రధానంగా పదిలేన్లుగా విస్తరించాల్సి వచ్చినపుడు కొత్తగా భూసేకరణ అంటే ఖర్చు విపరీతంగా పెరుగుతుందని చెప్పారు. దీంతో చంద్రబాబు కోరినట్లు 150 మీటర్లు కాకుండా 140 మీటర్ల వెడల్పుకు ఆమోదం తెలి పింది. మొత్తమ్మీద చంద్రబాబు ఆలోచనలకు అనుగుణంగా ఓఆర్ఆర్ నిర్మాణం జరగనున్నది.

సిటీ బస్సుల
కొత్త రూట్లపై కసరత్తు

- ఆరు రూట్లకు 54 మంది దరఖాస్తులు
- 9 లోపు నివేదిక ఇవ్వాలని ఆర్టీసీకి కలెక్టర్ ఆదేశాలు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి, పక్కన ఎస్పీ సతీష్‌కుమార్, డీటీసీ సీతారామిరెడ్డి

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): గుంటూరు నగర పరిధిలో ప్రైవేటు సిటీ బస్సుల కొత్త రూట్లపై అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఇప్పటికే ఆర్టీసీ సిటీ సర్వీసులకు రంగంలోకి దిగింది. ఈ పరిస్థితుల్లో ప్రైవేటు ఆపరేటర్ల నుంచి కూడా అధికారులు దరఖాస్తులు స్వీకరించారు. జాతీయ రహదారి వై జంక్షన్ నుంచి పెదపలకలూరు, ఆర్టీసీ బస్టాండ్ నుంచి లాం, ఆర్టీసీ బస్టాండ్ నుంచి అడవి తక్కెళ్లపాడు, పాత గుంటూరు మణి హోటల్ నుంచి ఆర్టీసీ బస్టాండ్, ఆర్టీసీ బస్టాండ్ నుంచి ఇన్నర్‌రింగ్‌రోడ్డు రెడ్డిపాలెం మీదగా ఆర్టీసీ బస్టాండ్, గుజ్జనగుండ్ల నుంచి గుండవరం వరకు మొత్తం ఆరు రూట్లలో సిటీ బస్సులు తిప్పుకునేందుకు 54 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఈ నేపథ్యంలో నగరంలో ప్రైవేటు సిటీ బస్సుల రూట్ల అనుమతులకు సంబంధించి బుధవారం కలెక్టరేట్‌లోని డీఆర్సీ సమావేశ మందిరంలో ఆర్‌టీఏ సమావేశం జరిగింది. దరఖాస్తుదారులతో అధికారులు సమీక్షించారు. ఈ సమావేశంలో కలెక్టర్ నాగలక్ష్మి మాట్లాడుతూ ఆయా రూట్లలో అనుమతులపై ఈ నెల 9వ తేదీలోపు ఆర్టీసీ అధికారులు నివేదిక అందించాలని ఆదేశించారు. అనంతరం అనుమతుల మంజూరుకు ఆర్‌టీఏ కమిటీ చర్యలు తీసుకుంటుందన్నారు. ఈ సమావేశంలో ఎస్పీ సతీష్‌కుమార్, డీటీసీ సీతారామిరెడ్డి, ఆర్టీసీ ఆర్‌ఎం కృష్ణకాంత్, ట్రాఫిక్ డీఎస్పీ రమేష్, ఆర్టీవో సత్యనారాయణ వరప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు చైన్‌స్నాచర్లు అరెస్టు

రూ.32 లక్షల బంగారు ఆభరణాలు స్వాధీనం

గుంటూరు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): మూడేళ్లుగా చైన్‌స్నాచింగ్‌లకు పాల్పడుతున్న ఇద్దర్ని పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి 32 లక్షల ఖరీదైన 390 గ్రాముల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించి నిందితులను బుధవారం పోలీస్ కార్యాలయంలో మీడియా ఎదుట హాజరు పరిచి ఎస్పీ సతీష్ కుమార్ వివరాలు వెల్లడించారు. నగరంలోని డీఎస్‌నగర్ 9వ లేనుకు చెందిన టైలర్ వల్లెపు శ్రీను, వసంతరాయపురం 4వ లేనుకు చెందిన అన్నపురెడ్డి శివసుబ్రహ్మణ్యం 2022 నుంచి చైన్‌స్నాచింగ్ నేరాలకు పాల్పడుతున్నారు. ఎట్టకేలకు నల్లపాడు పోలీసులు వీరిని అరెస్టు చేసి వారి కార్యకలాపాలకు బ్రేక్ వేశారు. మార్చిలో లింగాయపాలెం, పలకలూరు రోడ్డులోని గుంటూరు క్లబ్ దగ్గరలో జరిగిన చైన్‌స్నాచింగ్ ఘటనలపై కేసు నమోదు చేసిన నల్లపాడు సీఐ వంశీధర్ దర్యాప్తు చేపట్టారు. బాధితులు తెలిపిన సమాచారం ఆధారంగా లింగాయపాలెం, గుంటూరు క్లబ్ పరిసర ప్రాంతాల్లోని సీసీ కెమెరాలను పరిశీలించి పది రోజుల్లోనే వల్లెపు శ్రీనును అదుపులోకి తీసుకుని సీఐ విచారించారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా అన్నపురెడ్డి శివసుబ్రహ్మణ్యంతో కలసి నేరాలకు పాల్పడుతున్నట్లు టైలరింగ్ పనిచేసే శ్రీను చెప్పాడు. చీరాలకు చెందిన శివసుబ్రహ్మణ్యం 2009లో గుంటూరుకు వచ్చి ఆటో డ్రైవర్‌గా జీవనం సాగిస్తు న్నాడు. 2018లో స్నేహితులుగా మారిన ఇద్దరూ అప్పటి నుంచి దొంగతనాలకు పాల్పడుతున్నట్లు పోలీసుల విచారణలో తేలింది. సాయంత్రం 6 నుంచి 7 గంటల మధ్య ఒంటరిగా నడుచుకుంటూ వెళ్లే మహిళలను వెంబడించి చైన్‌స్నాచింగ్‌లకు పాల్పడుతున్నారు. వీరిద్దరూ కలిసి గుంటూరు పట్టాభిపురం - 2, నల్లపాడు - 4, అరండల్ పేట - 1, తెనాలి వన్ టౌన్ - 2, తెనాలి త్రీ టౌన్ - 1, తెనాలి రూరల్ -1, బాపట్ల జిల్లాలోని చీరాల టూ టౌన్ - 1, చీరాల త్రీ టౌన్ - 1 పోలీస్‌స్టేషన్ పరిధిలో 13 చైన్ స్నాచింగ్ దొంగతనాలకు పాల్పడ్డార న్నారు. వీరిపై ఇప్పటివరకు ఏ పోలీస్‌స్టేషన్‌లో కూడా కేసు నమోదు కాలేదని ఎస్పీ తెలిపారు. వీరు ఇప్పటి వరకు 420 గ్రాముల బంగారు ఆభరణా లు చోరీ చేయగా 390 గ్రాములు రికవరీ చేసినట్లు తెలిపారు. నేరాలకు ఉపయోగిం చిన ద్విచక్ర వాహనాన్ని కూడా స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. సీఐ వంశీధర్ బృందాన్ని, సౌత్ డీఎస్పీ బానోదయ, ఏఎస్పీ సుప్రజలను ఎస్పీ అభినందించారు. ఎస్‌ఐ జనా ర్ధన్, హెడ్ కానిస్టేబుల్ సుబ్బారావు, కానిస్టేబుళ్ళు సాంబశివరావు, మస్తాన్‌వలి, బిక్షనాయక్, వెంకటేశ్వర్లకు ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ సుప్రజ, ట్రైనీ ఐపీఎస్ దీక్ష తదితరులు పాల్గొన్నారు.



స్వాధీనం చేసుకున్న ఆభరణాలను పరిశీలిస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్

ఆరు పళ్ళ విభాగంలో కోదాడ ఎడ్లకు ప్రథమ స్థానం

బెల్లంకొండ, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కండిపాడు గ్రామంలో వెంకటేశ్వర స్వామి తిరునాళ్ళ సందర్భంగా నిర్వహించిన ఆంధ్ర, తెలంగాణా రాష్ట్రాల పశు బల ప్రదర్శనలో ఆరు పళ్ళ విభాగంలో తెలంగాణా రాష్ట్ర సూర్యాపేట మండలం కోదాడ గ్రామానికి చెందిన నలమాద ఉత్తమ్ పద్మావతిరెడ్డి ఎడ్ల జత 4400 అడుగుల దూరం లాగి ప్రథమస్థానం సాధించింది. నకిరికల్లు మండలం చల్లగుండ్ల గ్రామానికి చెందిన మేకా అంజిరెడ్డి ఎడ్ల జత 4000 అడుగుల దూరం లాగి రెండోస్థానం, ప్రకాశం జిల్లా కనిగిరి మండలానికి చెందిన సానికొమ్ము శ్రీనివాసరెడ్డి ఎడ్ల జత 3,389 అడుగుల దూరం లాగి మూడో స్థానం, తెలంగాణా రాష్ట్రం సూర్యాపేట మండలం కోదాడ గ్రామానికి చెందిన నలమాద ఉత్తమ్ పద్మావతి రెడ్డి ఎడ్ల జత 3,286 అడుగులు లాగి నాల్గో స్థానం, అచ్చంపేట మండలం వేల్పూరు గ్రామానికి చెందిన చావం హేమత్ సాయి రామ్‌కు చెందిన ఎడ్ల జత 3,219.7 అడుగుల దూరం లాగి ఐదో స్థానం, ముప్పాళ్ళ మండలం దమ్మాలపాడు గ్రామానికి చెందిన జీ లక్ష్మీ వివేక్‌కు చెందిన ఎడ్ల జత 3,131.7 అడుగుల దూరం లాగి ఆరో స్థానం సాధించాయి. ఆరు పళ్ళ విభాగంలో మొత్తం పది ఎడ్ల జతలు ప్రదర్శనలో పాల్గొన్నట్టు నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, బండి పల్లెకొండ, శ్రీహరిరావు, వెంకట నరసయ్య, గ్రామస్తులు పర్యవేక్షించారు.

నేడు రాజధాని రైతులకు ప్లాట్ల కేటాయింపు

తుళ్లూరు, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతికి భూములిచ్చిన రైతులకు ప్లాట్ల కేటాయింపు ప్రక్రియ కొనసాగుతుంది. గురువారం విజయవాడ లెనిన్ సెంటర్ నందు గల సీఆర్డీఏ ప్రధాన కార్యాలయంలో 15 గ్రామాలకు చెందిన రైతులకు ప్లాట్లు కేటాయించనున్నారు. 194 మంది రైతులకు 502 ప్లాట్లను ఆన్‌లైన్ ర్యాండమ్ సిస్టమ్ ద్వారా ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఈ-లాటరీ జరగనుందని సీఆర్డీఏ కార్యాలయం వర్గాలు బుధవారం తెలిపాయి. నవులూరు 1, 2 యూనిట్‌లకు, కురగల్లు 1, 2, నిడమర్రు 1, 2, పెనుమాక, నెక్కల్లు, అనంతవరం గ్రామాలకు సంబంధించిన రైతులు ఈ- లాటరీకి హాజరుకావాలని తెలిపారు. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు రాయపూడి 1, 2. వెంకటపాలెం, వెలగపూడి, మందడం 1, 2, దొండపాడు, పిచుకలపాలెం, ఐనవోలు, లింగాయపాలెం,ఉద్దండ్రాయునిపాలెం గ్రామాలకు సంబంధించిన రైతులు ఈ-లాటరీకి హాజరుకావాలని అధికారులు కోరారు.

సీడ్ యాక్సెస్ రోడ్డు పనులు పునఃప్రారంభం

మంగళగిరి, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిలో అతిప్రధానమైన సీడ్ యాక్సెస్ రోడ్డు పనులు పునఃప్రారంభమయ్యాయి. రాజధాని అమరావతిలో సీడ్‌యాక్సెస్ రోడ్డును దొండపాడు నుంచి మణిపాల్ ఆస్పత్రి వద్ద కనకదుర్గా వారధి వరకు జాతీయ రహదారి-16ను అనుసంధానించేలా ఈ-3 రోడ్డు పేరిట ఏర్పాటు చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ రోడ్డు నిర్మాణ పనులను రెండు దశలుగా చేపట్టారు. దొండపాడు నుంచి ఉండవల్లి వరకు ఒకదశగాను, ఉండవల్లి నుంచి కనకదుర్గావారధి వరకు రెండో దశగాను నిర్మించాలని ప్రతిపాదించి 2017-18 పీరియడ్‌లో వెంకటపాలెం వరకు దీనిని నిర్మించారు. అయితే తొలిదశ పనుల్లో అటూఇటూ కొంతమేర పనులు జరుగలేదు. ఈ తొలిదశ పనులకు సంబంధించి రాయపూడి జంక్షన్ నుంచి ఓ అరకిలోమీటరు దూరం వరకు దొండపాడు వైపు మధ్యలో నిలిచిపోయిన నిర్మాణ పనులను మంగళవారం నుంచి పునఃప్రారంభించారు. దీంతో పాటు రెండోదశ తాలూకు పనులను కూడా ఆరంభిస్తారని తెలుస్తోంది. ఈ మొత్తం పనులను ఎన్‌సీసీ కంపెనీ రూ.188 కోట్లకు దక్కించుకున్నట్టు తెలిసింది.



రాయపూడి వద్ద పునఃప్రారంభమైన సీడ్ యాక్సెస్ రోడ్డు పనులు

రైల్వే ప్రాజెక్టులపై అనిశ్చితి

- కేటాయింపులపై ఇప్పటికీ అస్పష్టతే
- పనులు ఎలా ముందుకెళ్లాలో తెలియని వైనం
- గతంలో బడ్జెట్ ప్రవేశపెట్టిన రెండు, మూడు రోజుల్లోనే పింక్‌బుక్
- 2 నెలలు గడుస్తున్నా విడుదల చేయని రైల్వేబోర్డు

గుంటూరు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): 2025-26 నూతన ఆర్థిక సంవత్సరం ప్రారంభమైనప్పటికీ కేంద్ర బడ్జెట్‌లో గుంటూరు డివిజన్ రైల్వే ప్రాజెక్టులకు జరిగిన కేటాయింపులపై స్పష్టత కొరవడింది. కీలకమైన అమరావతి నూతన రైలుమార్గం, గుంటూరు - బీబీనగర్ డబ్లింగ్, నడికుడి - శ్రీకాళహస్తి, గుంటూరు - గుంతకల్లు డబ్లింగ్ ప్రాజెక్టులకు ఏ మేరకు నిధులు కేటాయించారనేది తెలియకుండా ఉన్నది. రైల్వే అధికారులకు అంతర్గతంగానూ ఆ వివరాలను నేటివరకు రైల్వేబోర్డు పంపించలేదు. గతంలో పబ్లిక్ డొమైన్‌లో అన్ని వివరాలను ఉంచే రైల్వే బోర్డు ఈ ఏడాది ఎందుకు అంత గోప్యత పాటిస్తుందో ఎవరికి అంతు చిక్కకుండా ఉన్నది. దీనిపై ఇప్పటికే జెడ్ఆర్‌యూసీసీ, డీఆర్‌యూసీసీల సభ్యులు రైల్వేబోర్డుకు లేఖలు పంపారు.

కేంద్ర బడ్జెట్‌ని ఈ ఏడాది ఫిబ్రవరి ఒకటో తేదీనే ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ ప్రవేశపెట్టారు. గతంలో బడ్జెట్ ప్రవేశపెట్టిన రెండు, మూడు రోజుల వ్యవధిలో రైల్వేకి సంబంధించి అన్ని ప్రాజెక్టులు, వర్కులకు కేటాయించిన నిధుల వివరాలతో పింక్‌బుక్ విడుదలయ్యేది. ఇది ఇండియన్‌రైల్వేస్ వెబ్ పోర్టల్‌లో అందరికి అందుబాటులో ఉంచేవారు. దాంతో డివిజన్‌కి ఎంత మొత్తంలో నిధులు విడుదలయ్యాయనేది తెలిసిపోయేది. దాంతో ఆయా ప్రాజెక్టులు ఎప్పటిలోపు పూర్తి అవుతాయనే విషయంపై ఒక అంచనాకు వచ్చేవాళ్లు. గత ఏడాది నెల ఆలస్యమైనా పింక్‌బుక్‌ని రైల్వే శాఖ విడుదల చేసింది. ఈ సంవత్సరం ఏ కారణంతోనో రెండు నెలలైనా ఆ ఊసే లేకుండా పోయింది.

- గుంటూరు డివిజన్‌కి సంబంధించి నడికుడి - శ్రీకాళహస్తి(309 కిలోమటర్ల) రైలు మార్గం పనులను రైల్వే శాఖ రూ. 2650 కోట్లతో చేపట్టింది. ఇందులో దాదాపుగా రూ. 1300 కోట్ల విలువ చేసే పనులు పూర్తి అయ్యాయి. గత ఏడాది రూ. 450 కోట్లు మంజూరయ్యాయి. ఇవి ఏమేరకు ఖర్చు చేశారనేది 2024-25 రివైజ్డ్ అవుట్‌లేలో చూపిస్తారు. అలానే 2025-26కి ఎంత కేటాయింపులు చేశారనేది ప్రస్తుత ఆర్థిక సంవత్సరం అవుట్‌లేలో చూపిస్తారు. అలాంటిది ఆ వివరాలు ఏవీ తెలియని పరిస్థితి నెలకొన్నది.
- విజయవాడ - గుంటూరు వయా అమరావతి(106) కిలోమీటర్ల నూతన రైలు మార్గం పనులను రూ. 2679.59 కోట్లతో రైల్వే శాఖ మంజూరు చేసింది. వైసీపీ హయాంలో ఈ ప్రాజెక్టుకి రూపాయి కూడా కేటాయింపు జరగలేదు. గత ఏడాది కేంద్రంలో ఎన్‌డీటీ కూటమి ఏర్పడటం, అందులో టీడీపీ, జనసేన భాగస్వామ్యం కావడంతో దీనిని ముందుకు తీసుకెళ్లేందుకు రూ. 50 కోట్లు కేటాయించింది. దాంతో భూసేకరణ ప్రక్రియని రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించింది. ఈ ఏడాది ప్రాజెక్టుని గ్రౌండింగ్ చేసేందుకు ఎంత మేరకు నిధులు ఇచ్చారో తెలియకుండా ఉన్నది.
- గుంతకల్లు - గుంటూరు డబ్లింగ్(401.47 కిలోమీటర్లు)కు గత ఏడాది రూ. 480 కోట్లు కేటాయించింది. ఈ ప్రాజెక్టు మొత్తం వ్యయం రూ. 3269 కోట్లు కాగా ఇప్పటివరకు రూ. 2,918 కోట్లు ఖర్చు చేశారు. ఈ ప్రాజెక్టు చివరి దశకు చేరుకొన్న నేపథ్యంలో నిధులు విడుదల ఎంతో అవసరం. ఆ వివరాలు నేటివరకు డివిజన్‌కి కూడా అందని పరిస్థితి.
- గుంటూరు-బీబీనగర్ డబ్లింగ్‌కి రూ.2,853.23 కోట్లు ఖర్చవుతాయని అంచనా వేశారు. గతేడాది రూ. 220 కోట్లు మంజూరయ్యాయి. దాంతో పలు సెక్షన్లలో పనులు ప్రారంభమయ్యాయి. వాటిని వేగవంతంగా ముందుకు తీసుకెళ్లేందుకు నిధులు ఎక్కువ మొత్తంలో అవసరం. ఈ ఏడాది ఎంత కేటాయించారో తెలియడం లేదు.
- రైలు మార్గాలే కాకుండా డివిజన్‌లో లెవల్ క్రాసింగ్ గేట్లు తొలగించేందుకు పలు సెక్షన్లలో ఆర్‌వోబీ/ఆర్‌యూబీలను రైల్వే శాఖ గతంలోనే మంజూరు చేసింది. వాటి పనులు మొదలు కావాలంటే బడ్జెట్‌లో నిధుల కేటాయింపు తప్పనిసరి. ఈ సంవత్సరం ఎన్ని ఆర్‌వోబీ/ఆర్‌యూబీలు పూర్తి చేసేందుకు నిధులు విడుదల జరిగిందో స్పష్టత లేకుండా ఉన్నది.

రాజసానికి పెట్టింది పేరు ఒంగోలు జాతి ఎద్దులు

- బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత

తెనాలి రూరల్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు జాతి ఎద్దులంటేనే రాజసానికి, పౌరుషానికి పెట్టింది పేరని రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత అన్నారు. తెనాలి వ్యవసాయ మార్కెట్ యార్డు ప్రాంగణంలో ఆలపాటి శివరామకృష్ణయ్య మెమోరియల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఒంగోలు జాతి ఎడ్ల బల ప్రదర్శన, పశుపాల పోటీలకు ఐదో రోజు బుధవారం మంత్రి సవిత హాజరయ్యారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మంత్రి సవిత మాట్లాడుతూ తెనాలిలో జాతీయ స్థాయి ఎడ్లబల ప్రదర్శనతో పండుగ వాతావరణం సంతరించుకుందన్నారు. పోటీలను ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్యే నక్కాఆనంద బాబు, కమిటీ సభ్యుల సహకారంతో ఎనిమిది సంవత్సరాలుగా నిర్వహించడం అభినందనీయమన్నారు. ఇలాంటి పోటీలు నిర్వహించడం వల్ల భావితరాల్లో ఒంగోలు జాతి ఎడ్లపై మమకారం పెరుగుతుందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రైతుల కోసం కొత్త స్కీం తీసుకురాబోతున్నారని, పాడి రైతులను ప్రోత్సహించేలా డైరీ ఫామ్స్ పెట్టుకునేలా 50శాతం సబ్సిడీతో లోన్లు ఇచ్చి అంతరించిపోతున్న పాడి పరిశ్రమను తిరిగి నిలబెట్టుకునేలా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో చిలకలూరిపేట ఎమ్మెల్యేలు ప్రత్తిపాటి పుల్లారావు, యరపతినేని శ్రీనివాసరావు, విజయవాడ తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహనరావు కుమారుడు గద్దె క్రాంతికిరణ్, స్టేట్ మైనార్టీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ముస్తాక్ అహ్మద్ పలువురు ప్రముఖులు ముఖ్య అతిథులుగా హాజరై దివంగత ఎన్టీఆర్, ఆలపాటి శివరామకృష్ణయ్యల విగ్రహాలకు ముందుగా నివాళులర్పించి కార్యక్రమాలను ప్రారంభించారు.



సభలో మాట్లాడుతున్న మంత్రి సవిత, చిత్రంలో ఎమ్మెల్సీ ఆలపాటి, ఎమ్మెల్యేలు ఆనందబాబు, పుల్లారావు

సేద్యం విభాగంలో పెదగొట్టిపాడు ఎడ్లజత ప్రథమం

తెనాలి అర్బన్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ఆలపాటి వెంకట్రామయ్య స్మారక ఎడ్ల బల ప్రదర్శనలో పెదగొట్టిపాడు ఎడ్లు ప్రథమ స్థానం సాధించాయి. తెనాలి మార్కెట్ యార్డులో జరుగుతున్న ఎడ్ల ప్రదర్శనలో బుధవారం గరికపాటి లక్ష్మయ్య చౌదరి ఎడ్ల జత 5100 అడుగులు దూరం లాగి ప్రథమ స్థానంలో నిలిచాయి. పల్నాడు జిల్లా ఉయ్యందన గ్రామానికి చెందిన రైతు వీరబ్రహ్మనాయుడు ఎడ్ల జత 4854 అడుగులు దూరం లాగి ద్వితీయ స్థానం, వేటపాలెంకు చెందిన రైతులు శివకృష్ణ చౌదరి, శిరీష చౌదరీల ఎడ్లజత 4807అడుగుల దూరం లాగి తృతీయ స్థానం సాధించాయి. 4,5,6,7,8,9 స్థానాల్లో వరుసగా కొప్పురావూరు రైతు తోట శ్రీనివాసరావు ఎడ్ల జత 4734 అడుగుల దూరం, సరిపూడి రైతు పవన్‌కుమార్ చౌదరి ఎడ్ల జత 4449అడుగులు, సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ రైతు సహ్రాస యాదవ్ ఎడ్లజత 4395 అడుగులు, పెదగొట్టిపాడు రైతు లక్ష్మయ్య చౌదరి ఎడ్లజత 4202 అడుగులు, మాచవరం రైతు యామినిమోహన ఎడ్లజత 3935అడుగులు, కృష్ణా జిల్లా చినపులిపాక రైతు ఎడ్లజత 3600అడుగులు లాగాయి. విజేతలకు 1వ స్థానం నుంచి 9వ స్థానం వరకు దాతలు మైనేని రత్నప్రసాద్, మాదినేని హరికృష్ణలు రూ.60,000, విజయసారధి రూ.50,000, గౌతమ్ గ్రాండ్ రూ.40,000, కాట్రగడ్డ వెంకటేశ్వరరావు రూ.35,000, మద్రాసు సాంబశివరావు రూ.30,000, కనకమేడల మురళి రూ.25,000, ఈడ్పుగంటి వరప్రసాద్, కొత్తపల్లి శ్రీనివాసరావు రూ.15,000, కేసినేని జయదేవ్ రూ.10,000 బహుమతులు అందజేశారు. ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, పలువురు టీడీపీ నాయకులు పోటీలను పర్యవేక్షించారు.



సేద్యం విభాగంలో ప్రథమ స్థానం సాధించిన పెదగొట్టిపాడు ఎడ్ల జత

డ్రైవర్ నిర్లక్ష్యంతో వ్యక్తి మృతి

బస్సు డ్రైవర్‌పై కేసు నమోదు



తెనాలి, మారీసుపేట, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): బస్సును నిర్లక్షంగా నడిపి వ్యక్తి మృతికి కారణమైన ఆర్‌టీసీ బస్సు డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్టు టూటౌన్ పోలీసులు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గత నెల 31వ తేదీన ఆర్‌టీసీ బస్టాండ్ రోడ్డులో నడచి వెళ్తున్న గుర్తు తెలియని వ్యక్తిని విజయవాడ నుంచి తెనాలి డిపోకి వస్తున్న బస్సు డ్రైవర్ నిర్లక్ష్యంగా, అతి వేగంగా వచ్చి ఢీ కొట్టాడు. స్థానికులు గాయపడిన వ్యక్తిని జిల్లా వైద్యశాలకు తరలించగా మృతి చెందాడు. బుధవారం 36వ వార్డు వీఆర్‌వో బీ రత్నకుమారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు బస్సు డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్టు టూటౌన్ పోలీసులు తెలిపారు. మృతి చెందిన వ్యక్తికి సుమారు 38 సంవత్సరాలు ఉంటాయని బ్లూజీన్స్ ప్యాంటు, ఆఫ్ చేతులు చొక్కా ధరించి ఉన్నాడని ఆచూకీ తెలిసిన వారు టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.

బయట పడిన హత్యాయత్నం ప్రణాళిక ఆడియో

ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు

నూజెండ్ల, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : హత్యాయత్నం చేసిన పథక రచన ఆడియో బయట పడటంతో ఐనవోలులో బుధవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ బీవీ కృష్ణారావు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాలు.. మండలంలోని అల్లీబాయి పాలెం గ్రామానికి చెందిన కర్నాటి వెంకటరావు, అదే గ్రామానికి చెందిన మీరావలికి గతంలో నగదు అప్పుగా ఇచ్చి ఉన్నాడు. ఈ విషయమై జరిగిన లావాదేవీల్లో మీరావలి తన తమ్ముడు లాలయ్యతో కలసి హత్యాయత్నం పథకం గురించి ఫోన్‌లో చర్చించిన ఆడియో బహిర్గతం కావటంతో బాధితుడు వెంకటరావు ఫిర్యాదు మేరకు మీరావలి, లాలయ్యలపై కేసు నమోదు చేశామన్నారు.

70 కాదు.. 140 మీటర్లు

(5వ పేజీ తరువాయి)

అంచనా వేశారు. ఇపుడు అది 140 మీటర్లకు చేరుకోవడంతో వ్యయం రూ.5 వేల కోట్లను మించే అవకాశంఉంది. మొత్తం ఓఆర్ఆర్ అంచనా రూ.20 వేల కోట్లు అవనున్నది.

ఓఆర్ఆర్‌తో పాటే ఐఆర్ఆర్ కూడా..

రాష్ట్ర ప్రభుత్వం ఈ ఓఆర్ఆర్‌తో సంతృప్తి చెందకుండా ముందు ప్రతిపాదించిన విధంగా అంతర వలయ రహదారి(ఐఆర్ఆర్) నిర్మాణంపై కూడా దృష్టి పెట్టింది. ఓఆర్ఆర్ నిర్మాణ వ్యయం భరించనున్న నేపథ్యంలో ఐఆర్ఆర్‌ను పక్కన పెట్టాలని కేంద్రం దాదాపుగా రాష్ట్ర ప్రభుత్వానికి స్పష్టం చేసింది. అయితే ముఖ్యమంత్రి చంద్రబాబు ఐఆర్ఆర్ విషయమై ఇంకా కేంద్రంతో సంప్రదింపులు జరుపుతూనే ఉన్నారు. కేంద్ర ప్రభుత్వం ఐఆర్ఆర్ నిర్మాణానికి ముందుకురాని పక్షంలో పీపీపీ విధానంలో అయినా నిర్మించి తీరాలన్న కృతనిశ్చయంతో చంద్రబాబు ఉన్నట్లు తెలుస్తుంది.

అనుమతుల్లేని లే అవుట్లపై చర్యలు

రీజనల్ అసిస్టెంట్ డైరెక్టర్ సునీత

వినుకొండటౌన్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): అనుమతులు లేని లే అవుట్లపై చర్యలు తీసుకుంటామని రీజనల్ అసిస్టెంట్ డైరెక్టర్ బీ సునీత తెలిపారు. పట్టణంలోని అరుణ హాల్ ఎదురుగా ఉన్న ఏబీఎం కాంపౌండ్ ఆవరణలో అక్రమంగా నిర్మిస్తున్న 3 అంతస్తుల భవనాన్ని సునీత బుధవారం పరిశీలిం చారు. దారా వెంకట శేషమ్మ అక్రమంగా నిర్మిస్తున్న 3 అంతస్తుల బిల్డింగ్‌పై గత నెల 17వ తేదీన కలెక్టర్ కార్యాలయంలోని పీజీఆర్ఎస్‌కు గోళ్ల హిమ బిందుప్రియ ఫిర్యాదు చేశారు. ఫిర్యాదులో భాగంగా కలెక్టర్ ఆదేశాల మేరకు నూతనంగా నిర్మిస్తున్న భవనం తనిఖీకి వచ్చినట్లు సునీత తెలిపారు. కార్యక్రమంలో భాగంగా కారంపూడి రోడ్డు తారకరామ నగర్‌లోని అపార్ట్‌మెంట్లతో పాటు అదే రహదారిలోని ఆదిత్య స్కూల్ సమీపంలో నిర్మిస్తున్న అపార్ట్‌మెంట్‌లను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో సునీత మాట్లాడుతూ 2023 సంవత్సరంలో అపార్ట్‌మెంట్‌లకు అనుమతి ఇచ్చిన నేపథ్యంలో పూర్తి చేసి నివాస యోగ్యానికి సిద్ధమవుతున్న నేపథ్యంలో పరిశీలించడం జరిగిందని తెలిపారు. వినుకొండ పరిసర ప్రాంతాల్లో అక్రమ లే అవుట్లపై ప్రశ్నించగా త్వరలో పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు. మున్సిపాలిటీ పరిధిలో నూతనంగా నిర్మిస్తున్న భవన సముదాయ ఆవరణ ప్రాంతంలో రోడ్డుకు ఇరువైపులా 5 అడుగుల స్థలాన్ని మున్సిపాలిటీకి రిజిస్ట్రేషన్ చేయాలని, లేనిపక్షంలో బిల్డింగ్ నిర్మాణాలకు అనుమతులు నిరాకరించడం జరుగుతుందన్నారు. 2019 జూన్ 30 నాటి అక్రమ లే అవుట్లను క్రమబద్ధీకరించుకునేందుకు ఐపీఎల్‌పీ అయి ఉండి ప్రపోషనేట్ ఓపెన్ సెస్ చార్జీలతో పాటు 33.3 శాతం పీనలైజేషన్ చార్జీలు చెల్లించినట్లయితే అక్రమ లేఅవుట్లను క్రమబద్ధీకరించడం జరుగుతుందన్నారు. వినుకొండ పాత పట్టణంలో కనీసం 10 అడుగులు రోడ్డు ఉన్న ప్రాంతంలో నిర్మాణాలకు అనుమతి ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డీపీఏ (జిల్లా ప్లానింగ్ అధికారి) పూర్ణచంద్రారెడ్డి, ఇన్‌చార్జి మున్సిపల్ కమిషనర్ వెంకట్రావమ్మ తదితరులు పాల్గొన్నారు.



కారంపూడి రోడ్డులో నూతనంగా నిర్మిస్తున్న అపార్ట్‌మెంట్‌ను పరిశీలిస్తున్న సునీత

కుమార్తె మరణాన్ని తట్టుకోలేక తల్లి ఆత్మహత్య



రజని (ఫైల్‌ఫొటో)

మాచర్లటౌన్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): కుమార్తె అకాల మరణంతో మనస్తాపం చెంది తల్లి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మాచర్ల పట్టణంలో బుధవారం చోటుచేసుకుంది. పట్టణంలోని మండాది రోడ్డులో గల విశ్వబ్రాహ్మణ కాలనీలో తాళ్లూరి శ్రీనివాసాచారి, రజని (37) దంపతులు నివాసం ఉంటున్నారు. ద్వితీయ కుమార్తె అఖిల ఇటీవల ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. కుమార్తె అకాల మరణాన్ని జీర్ణించుకోలేక తల్లి రజని బుధవారం మధ్యాహ్నం భర్త పనులపై బయటకు వెళ్లగా పెద్ద కుమార్తె రమ్య వాష్‌రూంకు వెళ్లింది. ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. పక్కింటి మహిళ రమణ చూసి కేకలు వేయగా వాష్‌రూంలో ఉన్న పెద్ద కుమార్తె రమ్య బయటకు వచ్చేసరికి అప్పటికే రజని ప్రాణాప్రాయ స్థితిలో ఉంది. స్థానికులు రజనీని ప్రభుత్వాస్పత్రికి తరలించగా డాక్టర్లు చనిపోయినట్లు ధ్రువీకరించారు. పట్టణ సీఐ ప్రభాకరరావు, ఎస్ఐ సంధ్యారాణిలు ప్రభుత్వ వైద్యశాలకు చేరుకుని వివరాలు నమోదు చేసుకుని కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మూల్యాంకన కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలి

- ఎన్‌టీఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హైమారావు

గుంటూరు (విద్య) ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి మూల్యాంకనం గురువారం నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలని ఎన్‌టీఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీ హైమారావు విజ్ఞప్తి చేశారు. బుధవారం ఆర్‌జేడీ బీ లింగేశ్వరరెడ్డికి వినతిపత్రం అందజేశారు. జోన్ - 3 పరిధిలోని గుంటూరు,పల్నాడు, బాపట్ల, ఒంగోలు, నెల్లూరు జిల్లాల్లో మూల్యాంకన కేంద్రాల వద్ద మౌలిక వసతులు కల్పించాలని కోరారు. వినతిపత్రం సమర్పించిన వారిలో నోబుల్ టీచర్స్ అసోసియేషన్ పల్నాడు జిల్లా అధ్యక్షులు కె. సాంబశివ రావు, గుంటూరు జిల్లా అధ్యక్షులు షేక్ అబ్దుల్ ఖలీల్, గుంటూరు నగర శాఖ అధ్యక్షులు పీ సాయి విశ్వనాథ్, ప్రధాన కార్యదర్శి పి లలిత బాబు, జిల్లా నాయకులు ఏపీ కృష్ణా రావు తదితరులు పాల్గొన్నారు.



ఆర్‌జేడీ లింగేశ్వరరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ఎన్‌టీఏ నాయకులు

రైల్వేలో గ్రూప్ డీ ఉద్యోగాలకు ఉచిత శిక్షణ

గుంటూరు (విద్య) ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): రైల్వేశాఖలో గ్రూప్ డీ ఉద్యోగాల కోసం అవసరమైన శిక్షణను రామ్‌కీ ఫౌండేషన్, పరవస్తు క్రియేటివ్ ఫౌండేషన్, లయన్స్ క్లబ్ ఆఫ్ గ్రీన్ ల్యాండ్స్ సంయుక్త ఆధ్వర్యంలో ఉచితంగా అందించనున్నట్లు ఆయా సంస్థల ప్రతినిధులు ఎంవీ రామిరెడ్డి, గద్దె భాస్కర్, ప్రొఫెసర్ లక్ష్మీ కుమారిలు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 5వ తేదీన రెండు రాష్ట్రాల్లోని వివిధ నగరాలలో అర్హత పరీక్ష నిర్వహిస్తున్నామని, విజయం సాధించిన అభ్యర్థులకు శ్రీధర్ సీసీఎఫ్ సంస్థ నేతృత్వంలో మూడు నాలుగు నెలల పాటు హైదరాబాదులో ఉచిత శిక్షణ ఇస్తామని తెలిపారు. అభ్యర్థులకు శిక్షణతో పాటు వసతి, భోజనం, స్టడీ మెటీరియల్ ఉచితంగా ఇస్తామన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, విజయవాడ, కర్నూల్ నగరాల్లో పరీక్ష నిర్వహిస్తున్నామన్నారు. వివరాలకు 9866 777 870 నంబర్‌లో సంప్రదించాలని ఎంవీ రామిరెడ్డి కోరారు.

గుంటూరు మీదగా చర్లపల్లి - విశాఖపట్టణం రైలు

గుంటూరు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల రద్దీ దృష్ట్యా ఈ నెల 3వ తేదీ గురువారం గుంటూరు మీదగా చర్లపల్లి - విశాఖపట్టణం ప్రత్యేక రైలుని నడపనున్నట్లు గుంటూరు డీఆర్ఎం ఎం రామకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నంబరు. 07011 చర్లపల్లి - విశాఖపట్టణం ప్రత్యేక రైలు గురువారం రాత్రి 8.15కి బయలుదేరి 10.43కి నడికుడి, 11.13కి పిడుగురాళ్ల, 11.43కి సత్తెనపల్లి, అర్ధరాత్రి దాటాక 12.30కి గుంటూరు, శుక్రవారం ఉదయం 9.30కి విశాఖపట్టణం చేరుకొంటుందన్నారు. విశాఖపట్టణం వెళ్లే ప్రయాణీకులు ఈ ప్రత్యేక రైలు సదుపాయాన్ని వినియోగించుకోవాలని డీఆర్ఎం విజ్ఞప్తి చేశారు.

పారదర్శకంగా నాణ్యమైన పరికరాల పంపిణీ

- ఏపీ ఆగ్రోస్ కార్యాలయం
- ఆంధ్రజ్యోతి కథనానికి స్పందన

గుంటూరు సిటీ, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): నాణ్యమైన వ్యవసాయ పరికరాలను ఎఫ్ఎం-యాప్ ద్వారా పారదర్శకంగా పంపిణీ చేశామని ఆంధ్రప్రదేశ్ ఆగ్రోస్ కార్యాలయ వర్గాలు తెలిపాయి. 'కొటేషన్లతో కొట్టేశారు...... సబ్సిడీ యంత్రాల్లో కమీషన్ల మోత' అనే శీర్షికతో బుధవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి కార్యాలయ వర్గాలు స్పందించాయి. ఈ ఏడాది రైతులకు పంపిణీ చేసిన సబ్సిడీ వ్యవసాయ యంత్రాల ధరలు 2022 తో పోలిస్తే అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కొటేషన్ పద్ధతిలో వ్యవసాయ యంత్రాల ధరలు నిర్ణయించ లేదని, కమిటీ ఆధ్వర్యంలో పారదర్శకంగా ధరలను నిర్ణయించడం జరిగిందన్నారు. మార్కెటులో డీలర్లు రైతులకు బిల్లులు ఇవ్వకుండా, వారంటీలేని పరికరాలను ఇవ్వడం అనవాయితీగా జరుగుతుందని అన్నాయి. సబ్సిడీ ద్వారా పంపిణీ చేసే పరికరాలకు తప్పకుండా జీఎస్టీ బిల్లు ఇవ్వాలని, తద్వారా 12 శాతం పన్ను వసూలు చేయటం తోపాటు, 2 శాతం ఏపీ ఆగ్రోస్‌కు చెల్లించాల్సి రావటం వల్ల ధరల్లో వ్యత్యాసం ఉన్నట్లు పేర్కొన్నాయి.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

విజయపురిసౌత్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం బుధవారం నాటికి 518.40 అడుగులు ఉంది. ఇది 146.37 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 4050 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 6248 క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 7913 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1800, ఎల్ఎల్‌సీ ద్వారా 300 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 7913 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు ఇన్‌ఫ్లో వాటర్‌గా 20,311 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు ఇన్‌ఫ్లో వాటర్‌గా 3598 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.40
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	145, 154, 165
చికెన్ విత్ స్కిన్(కిలో)	280.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	290.00

1,28,132 మిర్చి టిక్కీల విక్రయం

గుంటూరు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు బుధవారం 1,30,848 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 1,28,132 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 56,061 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			షార్క్-1	10500	12400
334	9500	13000	బ్యాడిగి 355	10000	13200
నంబరు. 5	10000	13400	సింజెంటా		
273	10000	12900	బ్యాడిగి 5531	10500	12200
341	10500	14000	దేవనూరు డీలక్స్	10300	12700
4884	10000	11900	ఆర్మూరు	10000	11300
సూపర్ 10	--	--	తాలుకాయలు	4500	6500
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ					
తేజ	10300	13600			



స్టాండింగ్ కమిటీ సమావేశాన్ని నిర్వహిస్తున్న ఇన్‌చార్జి మేయర్ షేక్ సజీల, పక్కన కమిషనర్ పులి శ్రీనివాసులు

టెండర్లతో జీఎంసీకి ఆదాయం చేకూరేలా చర్యలు

● ఇన్‌చార్జి మేయర్ షేక్ సజీల

గుంటూరు కార్పొరేషన్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థకు చెందిన మార్కెట్లు, మరుగుదొడ్లు, సైకిల్ స్టాండ్‌లకు టెండర్ నిర్వహించి జీఎంసీకి ఆదాయం సమకూరేలా చర్యలు తీసుకుంటున్నామని, గత నెల 27న జరిగిన టెండర్ కం బహిరంగ వేలంలో హెచ్చు టెండర్ దాఖలు చేసిన వారి టెండర్లను స్టాండింగ్ కమిటీ ఆమోదించిందని నగర ఇన్‌చార్జి మేయర్ షేక్ సజీల తెలిపారు. కౌన్సిల్ సమావేశ మందిరంలో బుధవారం నగర కమిషనర్ పులి శ్రీనివాసులుతో కలిసి సజీలా నగరపాలక సంస్థ స్టాండింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఇన్‌చార్జి మేయర్ మాట్లాడుతూ నగరపాలక సంస్థకు చెందిన 13 ప్రాంతాల్లోని మరుగుదొడ్లు, సైకిల్ స్టాండ్‌లు, మార్కెట్లకు మార్చి 27న సీల్డ్ టెండర్, బహిరంగ వేలం చేపట్టగా పలువురు టెండర్ దాఖలు చేశారని, టెండర్‌లో అధిక బిడ్ దాఖలు చేసిన వాటిని స్టాండింగ్ కమిటీ విపులంగా చర్చించి ఆమోదించిందని తెలిపారు. సమావేశంలో స్టాండింగ్ కమిటీ సభ్యులు కొమ్మినేని కోటేశ్వరరావు, ఈరంటి వరప్రసాద్, షేక్ మీరావలి, దాసరి లక్ష్మీదుర్గ, ముప్పవరపు భారతి, నూకవరపు బాలా జీ, నగర పాలక సంస్థ అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, డిప్యూటి కమి షనర్ డి.శ్రీనివాసరావు, కౌన్సిల్ సెక్రెటరి పి.శ్రీనివాస్, మేనేజర్ బాలాజీ బాషా పాల్గొన్నారు.

నగరంపాలెం రోడ్డులో అనధికారిక పార్కింగ్ నిషేధం

నగరంలోని ట్రావెలర్స్ బంగ్లా నుంచి నగరంపాలెం 3 బొమ్మల సెంటర్ వరకు ప్రధాన రహదారి వెంట అనధికారికంగా పార్కింగ్ నిషేధమని, పార్కింగ్ చేసిన వాహనాలను 24 గంటల్లోగా (గురువారం) స్వచ్ఛందంగా తొలగించుకోవాలని, లేకుంటే ట్రాఫిక్ పోలీసులు, జీఎంసీ పట్టణ ప్రణాళిక సిబ్బంది సమన్వయంతో వాటిని జేసీబీలతో తొలగిస్తారని కమిషనర్ పులి శ్రీనివాసులు ఒక ప్రకటనలో స్పష్టం చేశారు.

నేడు తూర్పు నియోజకవర్గ దరఖాస్తుదారుల పరిశీలన

నగరపాలక సంస్థ పరిధిలో 2024-25 ఏడాదికి సంబంధించి ఆన్‌లైన్ బెనిఫీషియరీ మేనేజ్‌మెంట్ మోనిటరింగ్ సిస్టం (ఓబీఎంఎంఎస్) లో ప్రభుత్వ స్వయం ఉపాధి పథకాలకు దరఖాస్తు చేసుకున్న వారిలో గుంటూరు తూర్పు నియోజకవర్గంలో గురువారం బ్రహ్మానందరెడ్డి స్టేడియంలో లబ్ధిదారుల దరఖాస్తుల పరిశీలన క్యాంపు ఏర్పాటు చేశారని కమి షనర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

7న జీఎంసీ కౌన్సిల్ సమావేశం

నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశాన్ని ఈనెల 7న నిర్వహి స్తున్నట్లు కౌన్సిల్ సెక్రటరీ శ్రీనివాసరావు బుధవారం తెలిపారు. గత నెల 29వ తేదీన వాయిదా పడ్డ బడ్జెట్ సమావేశాన్ని తిరిగి ఈనెల 7న నిర్వహిస్తున్నామన్నారు. ఇన్‌చార్జి మేయర్ షేక్ సజీల అధ్యక్షతన ఈ సమావేశం జరుగుతుందని, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు, అధికారులకు కౌన్సిల్ సమావేశానికి సంబంధించిన నోటీసు అందజేశామని అన్నారు.

ఆలపాటికి అచ్చెన్న, టీడీపీ నేతల అభినందనలు

గుంటూరు, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీగా గెలుపొందిన మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ బుధవారం శాసనమండలిలో ప్రమాణ స్వీకారం చేశారు. శాసన మండలి ఛైర్మన్ మోషేన్ రాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ ప్రమాణ స్వీకారానికి రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడుతోపాటు మాచర్ల ఎమ్మెల్యే బ్రహ్మారెడ్డి, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకటరావు, టీడీపీ నేతలు చిట్టాబత్తిన చిట్టిబాబు, కనపర్తి శ్రీనివాసరావు తదితరులు ఆలపాటికి అభినందనలు తెలిపారు.



ఆలపాటిని అభినందిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యే బ్రహ్మారెడ్డి

ఆలపాటికి జడ్పీ ఛైర్‌పర్సన్ శుభాకాంక్షలు

గుంటూరు సిటీ, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీగా ప్రమాణ స్వీకారం చేసిన ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా శుభాకాంక్షలు తెలిపారు. గుంటూరులోని ఆలపాటి నివాసంలో బుధవారం ఆయనను కలిసిన కత్తెర దంపతులు భవిష్యత్తులో మరిన్ని పదవులు అలంకరించాలని ఆకాంక్షించారు. ఆలపాటిని కలిసి శుభాకాంక్షలు తెలిపిన వారిలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి డాక్టర్ కత్తెర సురేష్‌కుమార్, తెలుగుదేశం నాయకుడు సుద్ధపల్లి నాగరాజు తదితరులు ఉన్నారు.



ఆలపాటికి శుభాకాంక్షలు తెలియజేస్తున్న జడ్పీ ఛైర్‌పర్సన్ కత్తెర హెనీక్రిస్టినా, డాక్టర్ సురేష్‌కుమార్

విద్యుత్‌శాఖ కాంట్రాక్టు ఉద్యోగుల క్రీడాపోటీలు ప్రారంభం

గుంటూరు, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): విద్యుత్‌శాఖ కాంట్రాక్టు ఉద్యోగుల క్రీడాపోటీలు పొన్నూరు రోడ్డులోని విద్యుత్ భవన్ ఆవరణలో బుధవారం ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు జరిగే పోటీలను తొలి రోజు గుంటూరు సర్కిల్ ఆపరేషన్ ఎస్ఈ కేవీఎల్ఎన్ మూర్తి, గుంటూరు టౌన్-1 ఆపరేషన్ ఈఈ తిరుమలశెట్టి శ్రీనివాసబాబు లాంఛనంగా ప్రారంభించారు. మొదటి రోజు క్రికెట్, టెన్ని కాయిట్ డబుల్స్ నిర్వహించారు. గురు, శుక్రవారాలు కూడా ఆటల పోటీలు నిర్వహించనున్నారు. క్రీడా పోటీల్లో భాగంగా క్యారమ్స్, చెస్, వాలీబాల్ టగ్ ఆఫ్ వార్, షార్ట్ పుట్, కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. చివరగా విజేతలకు బహుమతులు అందజేయనున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు.



క్రికెట్ ఆడుతున్న విద్యుత్ శాఖ కాంట్రాక్టు ఉద్యోగుల

నేటి నుంచి ఓలా ఉబర్ సర్వీసులు నిలిపివేస్తున్నడ్రైవర్లు

గుంటూరు (తూర్పు), ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): పదేళ్లగా గుంటూరు, విజయవాడ నగరాల్లో ఆన్‌లైన్ క్యాబ్ నడుపుకుంటూ జీవనం సాగించే డ్రైవర్ల కష్టాన్ని 30 శాతం కమీషన్ల పేరుతో ఓలా ఉబర్ ప్రైవేటు కంపెనీలు దోచుకుని డ్రైవర్లకు మొండి చేయి చూపుతున్నారని దీనికి నిరసనగా గురువారం నుంచి సర్వీస్‌లను నిలిపివేస్తున్నట్లు గుంటూరు ఓలా ఉబర్ డ్రైవర్స్ అసోసియేషన్ నాయకులు స్పష్టం చేశారు. లాడ్జీ సెంటర్ వద్ద బుధవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. నిరసనల్లో ఎల్ సంపత్‌కుమార్, విల్సన్, కేజీ స్వామి, టి సుబ్రహ్మణ్యం, రసూల్, రాజేష్, రత్నబాబు, మణిబాబు పాల్గొన్నారు.

వసతి గృహాల్లో భద్రత కట్టుదిట్టం చేయాలి

● నేరాల నియంత్రణకు ముందస్తు రక్షణ చర్యలు అవసరం

● కలెక్టర్ నాగలక్ష్మి, ఎస్పీ సతీష్‌కుమార్ స్పష్టీకరణ



కలెక్టరేట్‌లోని డీఆర్‌సీ మీటింగ్ హాల్లో జరిగిన సమావేశంలో పాల్గొ న్న కలెక్టర్, ఎస్పీ

గుంటూరు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థలు, వసతి గృహాల్లో 18 సంవత్సరాల లోపు బాల, బాలికలు, మహిళలపై నేరాలు నివారించేందుకు నిర్దేశించిన ముందస్తు భద్రత, రక్షణ చర్యలు పకడ్బందీగా అమలు చేయాలని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని డీఆర్సీ సమావేశ మందిరంలో కలెక్టర్ నాగలక్ష్మి, ఎస్పీ సతీష్ కుమార్‌తో కలిసి జిల్లాలో 18 సంవత్సరాల లోపు బాలబాలికలు, మహిళలపై నేరాలు జరుగకుండా నివారించేందుకు చేపట్టాల్సిన భద్రత, రక్షణ చర్యలపై సంబం ధిత శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల్లో, వసతిగృహాల్లో ఉండే విద్యార్థుల భద్రత రక్షణకు సంబంధించిన అంశా లను సంబంధిత అధికారులు, నిర్వాహకులు నిరంతరం పర్యవేక్షించాల న్నారు. పాఠశాలలు, కళాశాలలు, హాస్టల్స్ ప్రవేశ మార్గాల వద్ద పర్య వేక్షణ కోసం సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. తల్లి దండ్రులు కాకుండా విద్యార్థుల కోసం వచ్చే ఇతర బంధువుల వివరాలను పూర్తి స్థాయిలో నమోదు చేసుకోవాలన్నారు. విద్యాసంస్థలు, వసతి గృహాలకు ప్రహరీలు నిర్మించటంతో పాటు, వాచ్‌మెన్‌లను తప్పనిసరి గా ఏర్పాటు చేసుకోవాలన్నారు. జిల్లాలోని అన్ని కళా శాల, వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్స్‌ను పోలీస్, ఐసీడీఎస్, మున్సిపల్ అధికారులు ప్రత్యేక టీంగా ఏర్పడి తనిఖీలు నిర్వహించి నివేదికలు అందించాలన్నారు.

ఎస్పీ సతీష్ కుమార్ మాట్లాడుతూ 18 సంవత్సరాల లోపు బాల, బాలికలపై నేరాలు నియంత్రించడానికి ఘటన జరిగిన తర్వాత చర్యలు తీసుకునే కంటే ముందస్తుగానే కొద్దిపాటి జాగ్రత్తలు, రక్షణ చర్యల తో నేరాలను నివారించవచ్చన్నారు. ప్రభుత్వ ప్రైవేటు విద్యాసంస్థలు వసతి గృహాల్లో సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేసుకునేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎస్ఎస్‌కే ఖాజావలి, అడిషనల్ ఎస్పీ జీవీ రమణమూర్తి, డీఎస్పీ సుబ్బారావు, ఆర్ఐఓ జీకే జుబేర్, డీఎంహెచ్‌వో డాక్టర్ కె.విజయలక్ష్మి, డీఈవో సీవీ రేణుకా, ఐసీడీఎస్ పీడీ కేవీహెచ్ఎస్ విజయలక్ష్మి, విభిన్న ప్రతిభావంతులు ఏడీ సువార్త, డీవీఈవో జె.పద్మ, అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ అధికారి భవాని, సోషల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాల ప్రిన్సి పాల్ ఎం కొండారెడ్డి, తదితర అధికారులు పాల్గొన్నారు.



కలెక్టర్ నాగలక్ష్మికి వినతికిపత్రం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్సీ లక్ష్మణరావు, జేఏసీ నాయకులు

శంకర్ విలాస్ బ్రిడ్జి నిడివి కుదించటం సరికాదు

● అదనపు నిధులు సమకూర్చి పాతప్లాన్ ప్రకారం నిర్మించాలి

● కలెక్టర్‌కు జేఏసీ నాయకుల వినతి

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): రాబోయే 50 ఏళ్లలో భవిష్యత్తు ప్రజల అవసరాలు, బహుళ ప్రయోజనాలను నెరవేర్చే విధంగా శంకర్‌విలాస్ రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మించాలని, చాలీచాలని నిధులతో తక్కువ నిడివితో నిర్మిస్తే ప్రయోజనం ఉండదని శంకర్‌విలాస్ ఫ్లైఓవర్ జేఏసీ నాయకులు అన్నారు. బుధవారం జేఏసీ నాయకులు గుంటూరులోని ఓ హోటల్లో విలేకరుల సమావేశం నిర్వహించారు. అనంతరం జేఏసీ నాయకులు, మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావుతో కలిసి కలెక్టర్ నాగలక్ష్మికి వినతి పత్రం అందజేశారు. జేఏసీ నాయకులు ఎల్ఎస్ భారవి మాట్లాడుతూ ఆర్‌వోబీకి తాము వ్యతిరేకం కాదని, అది భవిష్యత్తుకు ఉపయోగపడే విధంగా ఉండాలన్నదే తమ అభిప్రాయం అని స్పష్టం చేశారు. ప్రస్తుత ట్రాఫిక్ అవసరాల రీత్యా ఆరులైన్ల నిర్మాణం అవసరం అని చెప్పిన కలెక్టర్, అధికార యంత్రాంగం నాలుగు లైన్లకు తగ్గించడమే కాకుండా, ఆర్‌యూబీ కూడా లేకుండా ట్రాఫిక్ అవసరాలు ఎలా తీరుతాయో ప్రజలకు చెప్పాలని కోరారు. జేఏసీ నాయకులు పీవీ మల్లి కార్జునరావు మాట్లాడుతూ అధికార యంత్రాంగం డీపీఆర్ ఆమోదానికి ముందు ప్రజలతో ఎలాంటి చర్చ జరపలేదన్నారు. చరిత్రలో చెప్పుకునే విధంగా ఐకానిక్ బ్రిడ్జి నిర్మించాలని, అవసరమైతే అందుకు అదనపు నిధులు సాధన కోసం కృషి చేయాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో జేఏసీ నాయకులు అవధానుల హరి, ఎస్ కమలకాంత్, రాధాకృష్ణ, వి.సదాశివరావు, వెంకట్రావు, కె.నళినీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ కార్మికుల ధర్నాను జయప్రదం చేయండి



కరపత్రికలను ఆవిష్కరిస్తున్న యూనియన్ నాయకులు

గుంటూరు (తూర్పు), ఏప్రిల్ 2 (ఆంధ్ర జ్యోతి): యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో ఈ నెల 7న విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికుల సమస్యల పరిష్కారానికై ఏపీ సీపీడీసీఎల్, విజయవాడ విద్యుత్‌భవన్ వద్ద జరిగే ధర్నాను జయ ప్రదం చేయాలని యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు బి.లక్ష్మణరావు, ప్రధాన కార్యదర్శి జి.నాగరాజులు పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక బ్రాడీపేటలోని సీఐటీయూ నగర కార్యాలయంలో బుధవారం కరపత్రాలను ఆవిష్కరించి వివరాలు వెల్లడించారు. కార్యక్ర మంలో బి.ముత్యాలరావు, జి.పవన్, రాంబాబు పాల్గొన్నారు.

యరజర్ల నాగాచారికి కాళహస్తి కళావాహిని పురస్కారం

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయం అన్నమయ్య కళావేదికపై బుధవారం ప్రముఖ రంగస్థల నటులు, హార్మోనిస్టు పోతకమూరి కాళ హస్తీశ్వరరావు 16వ వర్ధంతి సభ జరిగింది. ప్రధాన కార్యదర్శి, కాళహ స్తి కళావాహిని పోతకమూరి తారక బ్రహ్మాచార్యులు సభా పరిచయం చేశారు. సభాధ్యక్షులుగా కాళహస్తి కళావాహిని అధ్యక్షుడు, నటుడు, దర్శకులు, ప్రయోక్త ఏంవీఎల్. నరసింహారావు, గౌరవఅతిథిగా తెలుగు విభాగాధిపతి, హిందు కళాశాల ప్రొఫెసర్ ఎల్లాప్రగడ మల్లికార్జునరావు పాల్గొన్నారు. తొలుత ఆలయ పాలకమండలి అధ్యక్షుడు సీహెచ్ మస్తానయ్య అతిథులు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాలను ప్రారం భించారు. అతిథులు, సంస్థ వారు యెల్లంపల్లి యరజర్ల నాగాచారికి కాళహస్తి కళావాహిని పురస్కార ప్రదానం చేసి సత్కరించారు. అనంతరం నవక్రాంతి కల్చరల్ అసోసియేషన్, హైదరాబాద్ వారిచే ఏం. అర్జునరావు దర్శకత్వంలో నర్తనశాల పౌరాణిక నాటకం ప్రదర్శిం చారు. సంస్థ వారు కళాకారులను సత్కరించారు.



యెల్లంపల్లి యరజర్ల నాగాచారికి పురస్కారం అందజేస్తున్న నిర్వాహకులు

ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వం దృష్టి సారించాలి

● ప్రభుత్వ ఉద్యోగుల సంఘ జిల్లా అధ్యక్షుడు సయ్యద్ చాంద్ బాషా

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఏర్పడి ఎనిమిది నెలలు గడిచినా ఉద్యోగుల సమస్యలపై దృష్టి సారించలేదని ప్రభుత్వ ఉద్యోగుల సంఘ జిల్లా అధ్యక్షుడు సయ్యద్ చాంద్ బాషా అన్నారు. మెడికల్ కళాశాల ఆవరణలో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రెండేళ్లగా పీఆర్సీ లేదని, డీఏలు, ఐఆర్‌లు లేవని, చివరికి మూడు సంవత్సరాల నుంచి సరెండర్ లీవులు కూడా లేవని అన్నారు. కనీసం ఉద్యోగులు దాచుకున్న డబ్బులు కూడా సరైన సమయంలో చెల్లించడం లేదని అన్నారు. కేంద్ర ప్రభుత్వం క్రమపద్ధతి లో డీఏలు ప్రకటిస్తే రాష్ట్ర ప్రభుత్వం మాత్రం ఒక్క డీఏ విడుదల చేయలేదని విమర్శించారు. ఉద్యోగుల సమస్యలపై క్యాబినెట్ సబ్ కమి టీని ఏర్పాటు చేసి సమస్యలను పరిష్కారించాలని కోరారు. సమావేశం లో సంఘ సభ్యులు పోతురాజు, రెహమన్, లక్ష్మీనారాయణ, కోటా సాహెబ్, వై నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో కలల సాకారానికి కృషి చేయాలి

● ప్రభుత్వ జ్వరాల ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రఘు

గుంటూరు(విద్య), ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో తాము కన్న కలల సాకారానికి కృషి చేసినప్పుడే ఉన్నత విజయాలు సాధ్యమవుతాయని ప్రభుత్వ జ్వరాల ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్ రఘు అన్నారు. బుధవారం స్థానిక మెయిన్ క్యాంపస్‌లో భాష్యం మెడిఎయిమ్స్ ఆధ్వర్యంలో జరిగిన కల్చరల్ ఫెస్ట్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. డాక్టర్ రఘు మాట్లాడుతూ ఒత్తిడికి దూరం గా సరైన ప్రణాళికతో దినచర్యను రూపొందించుకుంటే గొప్ప విజయాలు సాధించవచ్చన్నారు. భాష్యం విద్యాసంస్థల వైస్ ఛైర్మన్ భాష్యం హనుమంతరావు మాట్లాడుతూ సరైన నిద్ర, ఆహారం, వ్యాయామంతో పాటు దిన చర్యను ప్రణాళికాబద్ధంగా రూపొందించుకుని అనుకున్న లక్ష్యాలను సాధించాలని విద్యార్థులకు సూచించారు. సభకు భాష్యం మెడెక్స్ ప్రిన్సిపాల్ హరిబాబు అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో భాష్యం మెడిఎయిమ్స్ ప్రిన్సిపాల్ సుధ, మెడికల్ ఫౌండేషన్ ప్రోగ్రామర్ డాక్టర్ చాంద్‌బాషా, ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ రఘు

సాంక్రమిక వైద్యశాలలో ఓపీ రోగులకు అన్నదానం

గుంటూరు మెడికల్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక అమరావతి రోడ్డులోని ప్రభుత్వ ఛాతి, సాంక్రమిక వ్యాధుల వైద్యశాలలో బుధవారం సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.రఘు ఆధ్వర్యంలో అమ్మ ఛారిటబుల్ ట్రస్ట్ సౌజన్యంతో ఓపీ రోగులకు ఉచిత మధ్యాహ్న భోజన సదుపాయం ఏర్పాటు చేశారు. ప్రభుత్వ సమగ్రాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వి దీనిని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఏపీలోని అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల కంటే భిన్నంగా మొదటిసారిగా ఓపీ రోగుల కోసం ఉచిత భోజన కార్యక్రమం ప్రారంభించడం అభినందనీయమని తెలిపారు. గుంటూరు అమ్మ ఛారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు స్వామి జ్ఞాన ప్రసన్న గిరిబాబా మాట్లాడుతూ డొక్కా సీతమ్మ తల్లి నిత్య అన్నదానం పేరిట ఉచితంగా ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమం దీర్ఘకాలం కొనసాగాలని ఆకాంక్షించారు. ఆస్పత్రి సిబ్బంది, అమ్మ ఆశ్రమ సేవకులు పాల్గొన్నారు.

కార్పొరేట్ సంస్థలకు మోదీ దాసోహం : జంగాల

గుంటూరు (తూర్పు), ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని నరేంద్ర మోదీ ఎన్డీఏ ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు దాసోహమైందని, అన్ని రంగాల్లోనూ తిరోగమనం వైపు పయనిస్తుందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జంగాల అజయ్‌కుమార్ విమర్శించారు. ఎన్డీఏ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా సీపీఐ దేశవ్యాప్త ప్రచార ఆందోళనలో భాగంగా బుధవారం స్థానిక అంబేద్కర్ విగ్రహం లాడ్జి సెంటర్ నుంచి శంక ర్‌విలాస్ వరకు ప్రచార ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మోదీ దుష్ట పాలనలో దేశ ఆర్థిక వ్యవస్థ పతనమైందని మండిపడ్డారు. విద్యార్థులు, కార్మికులు, రైతులు అన్ని వర్గాల ప్రజలు ఈ దుర్మార్గ పాలనను ఎండగట్టాలని పిలుపునిచ్చారు. మార్చి 23 భగత్‌సింగ్ వర్ధంతి నుంచి ఏప్రిల్ 14 అంబేద్కర్ జయంతి వరకు ఈ ఆందోళనలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమం లో కోట మాల్యాద్రి, మేడా హనుమంతరావు, ఆకిటి అరుణ్‌కుమార్, జి.సురేష్‌బాబు, రావు ల అంజిబాబు, మంగా శ్రీనివాస్, జి.లక్ష్మీ, కంజుల విఠల్‌రెడ్డి పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో హత్య కేసుల నిందితులు

గుంటూరు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని అరండల్‌పేట, నల్లపాడు పోలీస్‌స్టేషన్ల పరిధిలో మంగళవారం జరిగిన రెండు వేర్వేరు హత్య కేసుల్లో నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అరండల్‌పేట ఒకటో లైన్‌లో కేవీపీ కాలనీకి చెందిన పోలేపల్లి గణేష్‌ను గుర్తు తెలియని వ్యక్తులు హత్య చేశారు. ఈ కేసులో పోలీసులు విచారణ జరపగా భిక్షాటన చేసేవారే ఈ హత్యకు కారణంగా పోలీసులు దృష్టికి వచ్చింది. హతుడు గణేష్ మద్యం సేవించి జులాయిగా తిరుగుతుంటాడని పోలీసులు తెలిపారు. ఓవర్ బ్రిడ్జి, అరండల్‌పేట 1వ లైనులో భిక్షాటన చేసే వారిని బెదిరించి వారి వద్ద ఉన్న డబ్బు గుంజుకుంటుంటాడు. ఈ క్రమంలో చంద్రబాబునాయుడు కాలనీకి చెందిన మరో ఇరువురితో కలిసి తిరుగుతూ ఓవర్ బ్రిడ్జ్ వద్ద భిక్షాటన చేసే ఓ మహిళను బెదిరించి ఆమె దగ్గర డబ్బు గుంజుకుంటుండగా అదే సమయంలో ఆమె బంధువులు అక్కడికి వచ్చి వీరిపై ఆగ్రహం వ్యక్తం చేయడంతో వారు వెళ్లిపోయారు. ఆ తర్వాత తమను బెదిరించిన వారి వద్దకు గణేష్‌తో పాటు మరో ఇరువురు కలిసి వెళ్లారు. అయితే ఆ పక్కనే ఉన్న ఓ యువకుడు కోపంతో కత్తితో గణేష్‌పై దాడి చేశాడు. అయితే ఈ దాడికి పాల్పడిన నిందితుడిని కూడా గణేష్ అనేకసార్లు బెదిరించి భిక్షాటన చేయగా వచ్చిన డబ్బులను గుంజుకున్నాడు. దీంతో కోపంతో ఉన్న నిందితుడు గణేష్‌ని చూడగానే తన వద్ద ఉన్న కత్తితో పొడవడంతో గణేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. కాగా గణేష్ హత్య కేసులో నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. ఇదిలాఉంటే నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలోని రెడ్డిపాలెంలో జరిగిన దారావత్ రాము నాయక్ హత్య కేసులో నిందితుడైన బట్టు రాజును పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. అంతేగాక రాజు మానసిక పరిస్థితి కూడా సరిగా ఉండదని పోలీసులు తెలిపారు.

ఉదయం 8 నుంచి భారీ వాహనాలు నగరంలోకి నిషేధం

● ట్రాఫిక్ డీఎస్పీ రమేష్

గుంటూరు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : భారీ వాహనాలు ఉదయం 8 గంటల నుంచి రాత్రి 10 గంటలలోపు నగరంలోకి ప్రవేశించడం నిషేధమని ట్రాఫిక్ డీఎస్పీ రమేష్ స్పష్టం చేశారు. ఎస్పీ సతీష్‌కుమార్ ఆదేశాల ప్రకారం వెస్ట్ ట్రాఫిక్ పరిధిలోని హెవీ వెహికల్స్ (నాలుగు చక్రాల కంటే ఎక్కువ ఉన్న వాహనాలు) యూనియన్ నాయకులతో బుధవారం ఆయన తన కార్యాలయంలో సమావేశమయ్యారు. నిషేధిత సమయాల్లో భారీ వాహనాలు నగరంలోకి ప్రవేశించరాదన్నారు. అందుకు భిన్నంగా ఎవరైనా నగరంలోకి ప్రవేశిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. ఈ సమావేశంలో వెస్ట్ ట్రాఫిక్ సీఐ సీహెచ్ సింగయ్య తదితరులు పాల్గొన్నారు.



సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే నసీర్

పారిశుధ్యంపై నిర్లక్ష్యం తగదు

● అధికారులకు ఎమ్మెల్యే నసీర్ హెచ్చరిక

గుంటూరు, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): 'పారిశుధ్యంపై ఎందుకంత నిర్ల క్ష్యం.. ఎన్నిసార్లు చెప్పినా ఎందుకు ఆలకించరు? మురుగుతో ప్రజలు ఇబ్బంది పడుతుంటే కనీసం పట్టించుకోరా.. ఎమ్మెల్యే వస్తున్నారని తెలిసినా సంబంధిత అధికారులు అందుబాటులో ఉండరా? ప్రజలకంటే స్వచ్ఛ సర్వేక్షణ్ సర్వేలు ఎక్కువయ్యాయా?' అంటూ మున్సిపల్ అధికారులపై గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. నియోజకవర్గంలోని రాజీవ్‌నగర్‌లో బుధవారం ఆయన పలు అభివృద్ధి కార్యక్రమాల శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆ ప్రాంత ప్రజలు ఆయనకు పారిశుధ్యంపై ఫిర్యాదులు చేశారు. దీంతో ఆయన సంబంధిత అధికారులు ఎక్కడంటూ ప్రశ్నించారు. ఆ సమయానికి ఎవరూ లేకపోవడంతో ఎమ్మెల్యే నసీర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే పారిశుధ్య పనులు చేపట్టాలని, ప్రజల నుంచి ఎలాంటి ఫిర్యాదులు వచ్చినా సహించబోమని హెచ్చరించారు. రాజీవ్‌నగర్, వసంతరాయపురంలో రూ.1.14 కోట్ల విలువ చేసే సీసీ రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. నగరాభివృద్ధిలో ప్రణాళికా యుతంగా ముందుకెళుతున్నామని చెప్పారు. కూటమి ప్రభుత్వం అధి కారం చేపట్టాక గుంటూరు కార్పొరేషన్‌ను సుందరంగా మారుస్తు న్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి మేయర్ సజీల, కార్పొరేటర్ భారతి, దయారత్నం, గోళ్ల ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

నెట్‌వర్క్ ఆస్పత్రుల బకాయిల పాపం వైసీపీదే

గత వైసీపీ ప్రభుత్వం నెట్‌వర్క్ ఆస్పత్రుల బిల్లుల చెల్లింపులో తీవ్ర నిర్లక్ష్యం చేసిందని ఎమ్మెల్యే నసీర్ ఆరోపించారు. గుంటూరులోని తన కార్యాలయంలో ఏపీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్ అసోసియేషన్ సభ్యులు రాఘవశర్మ, అవినాశ్‌లు ఆయనను కలిసి ఆరోగ్యశ్రీ బకాయిలపై వినతిపత్రం అందించారు.

పారిశుధ్య పనులు సమర్థవంతంగా నిర్వహించాలి

గుంటూరు కార్పొరేషన్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): పారిశుధ్య పనులు క్షేత్ర స్థాయిలో సమర్థవంతంగా నిర్వహించడంలో లోపం జరుగుతుందని తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ తెలిపారు. బుధవారం కార్పొరేషన్లను కౌన్సిల్ హాల్ కమిషనర్ పులి శ్రీనివాసులుతో కలిసి పారిశుధ్యంపై సమీక్ష నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మెరుగైన పర్యవేక్షణ కోసం శానిటరీ డివిజన్లను 32కు పెంచటంతోపాటు అవసరమైన పుష్ కాట్స్, ఆటోలు, ట్రాక్టర్లు, అదనపు కార్మికులను కేటాయించినప్పటికీ, పనులు చేపట్టడంలో లోపం జరుగుతుందన్నారు. నగరంలో పారిశుధ్య పనుల్లో నిర్లక్ష్యాన్ని సంహించబోమని అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. కమిషనర్ మాట్లాడుతూ ఉగాది, రంజాన్ వంటి పెద్ద పండుగల సమయాల్లో కూడా తూర్పు నియోజకవర్గంలో పలు ప్రాంతాల్లో శానిటేషన్ సక్రమంగా లేదన్నారు. కార్మికులు, సెక్రటరీలు నిర్దేశిత సమయంలో విధుల్లో ఉండటం లేదని, ప్రతి రోజు ఇంటి నుంచి చెత్త సేకరణ చేయడంలేదని ప్రజల నుంచి ఫిర్యాదులు అందుతున్నాయన్నారు. మెరుగైన పారిశుధ్యానికి అధికారులవైపు నుంచి చేసే కృషికి ప్రజాప్రతినిధుల నుంచి కూడా పూర్తి సహకారం అంది స్తామన్నారు. సమావేశంలో సీఎంహెచ్‌వో డాక్టర్ అమృ తం, ఎంహెచ్‌వో డాక్టర్ రవిబాబు, ఈఈ సుందరరామిరెడ్డి, వెహికల్ షెడ్ డీఈఈ, ఏఈ, ఎస్ఎస్‌లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.



బాధితుల నుంచి వినతులు తీసుకుంటున్న ఎమ్మెల్యే గళ్ళా మాధవి

అర్హులందరికీ కార్పొరేషన్ రుణాలు

● పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి

గుంటూరు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): అర్హులైన ప్రతి ఒక్కరికీ కార్పొరేషన్ ద్వారా రుణా లు అందించి ఉపాధి కల్పనను ప్రోత్సహిస్తామని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. గుంటూరు పశ్చిమ కార్యాలయంలో బుధవారం ఆమె ప్రజాగ్రీవెన్స్ నిర్వహించి, ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. గుంటూరు కొరిటెపాడుకు చెందిన ఓ మహిళ చిట్టీల పేరుతో 2024 సంవత్సరంలో సుమారు రూ.3 కోట్లతో ఉడాయించిందని తమకు న్యాయం చేయాలని బాధిత మహిళలు కొందరు ఎమ్మెల్యేని కోరారు. కొత్త రేషన్ కార్డులు మంజూరు చేయాలని మరికొందరు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిట్టీల విషయంలో అప్రమత్తంగా ఉండాలని, పోలీసుల దృష్టికి తీసుకువెళ్లి బాధితుల సమస్య పరిష్కరించేందుకు కృషి చేస్తానని చెప్పారు. కార్పొరేషన్ రుణాలు అర్హతను బట్టి అందుతాయని చెప్పారు. పీ- 4 గురించి వైసీపీ నేతలు అవాకులు చవాకులు పేలుతున్నారని, మంత్రిగా పనిచేసి పోలవరం డయాఫ్రమ్ వాల్, కాఫర్ డ్యాం గురించి తెలియదని చెప్పిన మతిలేని వ్యక్తి ఈ రోజు పీ- 4 గురించి అవహేళన చేయడం విడ్డూరంగా ఉందన్నారు. కార్యక్రమంలో సింహాద్రి కనకాచారి తదితరులు పాల్గొన్నారు.

ప్రగతి పథంలో ప్రభుత్వం : ధారూనాయక్

గుంటూరు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): కూటమి రాష్ట్రాన్ని ప్రగతిపథంలో పరుగులు పెట్టిస్తోందని టీడీపీ రాష్ట్ర ఎస్టీ సెల్ అధ్యక్షుడు ధారూనాయక్ అన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన గుంటూరులో విలేఖరులతో మాట్లాడుతూ గత వైసీపీ ప్రభు త్వంలో జరిగిన నష్టాన్ని అధిగమించి రాష్ట్రం అభివృద్ధి చెందేలా, ప్రజలకు సంక్షేమం అందించేలా కూటమి పాలన కొనసాగుతుందన్నారు. ఎన్నికల హామీల అమల్లో భాగంగా ఏప్రిల్ తొలివారంలో మెగా డీఎస్సీ ద్వారా 16,347 టీచర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసి పాఠశాలలు ప్రారంభించే సమయానికి నియమకాలను పూర్తి చేయనుందన్నారు. మే నెలలో తల్లికి వందనం కింద ప్రతి విద్యార్థికి 15వేల రూపాయలు, అన్నదాత సుఖీభవ కింద మూడు విడతలలో రూ.5 వేలు, రూ.5వేలు, రూ.4 వేలు అందించనున్నట్లు తెలిపారు. బీసీ, ఎస్సీ ఎస్టీలను ఆర్థికంగా ఉన్నత స్థితికి తీసుకొచ్చేందుకు వన్ ఫ్యామిలీ వన్ ఎంటర్ ప్రెన్యూర్ అనే నినాదాన్ని కూటమి తీసుకువచ్చిందన్నారు.

గంజాయి నిందితుల అరెస్టు



నిందితులను అరెస్టు చూపుతున్న వన్‌టౌన్ ఎక్సైజ్ సీఐ లత, సిబ్బంది


గుంటూరు కార్పొ రేషన్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరంలోని ఐపీడీ కాలనీ లో గంజాయి తాగుతున్న ఇద్దరిని అరెస్టు చేసినట్లు బుధవారం గుంటూరు వన్‌టౌన్ ఎక్సైజ్ బీ లత తెలిపారు. నగరంలోని సత్యసాయిబాబా ట్రస్టు సమీపంలోని సంగడిగుంటకు చెందిన షేక్ మస్తాన్ వలి, షేక్ ఇస్మాయిల్ అనే ఇద్దరు వద్ద గంజాయి ఉందని అందిన సమాచారం మేరకు వారిని అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు. వారి నుంచి 40 గ్రా ములు గంజాయి స్వాధీన పరచుకున్నట్లు ఆమె చెప్పారు. దాడుల్లో ఎస్ఐలు షరీఫ్, తిరు మలేశ్వరరావు, సిబ్బంది రామయ్య, బసవేశ్వరరావు, శ్రీనివాసరావు, సంధ్య, వీఆర్వోలు షేక్ ఆలి, వెంకట శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



ఎండీయూ వాహనాల వద్దే ఈకేవైసీ

- రేషన్ షాపుల వద్ద కొలిక్కిరాని ప్రక్రియ
- మూడు జిల్లాల్లో 5 లక్షల పైచిలుకు పెండింగ్
- నెలాఖరు వరకూ గడువు పొడిగింపు..
- ఆ లోగా పూర్తి కాకుంటే రేషన్ కట్..
- ఈనెల కూడా కనిపించని కందిపప్పు

రేషన్ కార్డుదారుల ఈ కేవైసీ ప్రక్రియ నత్త నడకన సాగుతోంది. మార్చి నెలాఖరులోగా పూర్తి చేయాలని ప్రభుత్వం పౌర సరఫరాల శాఖకు ఆదేశాలు ఇచ్చినా ఆ ప్రక్రియ ముందుకు సాగలేదు. రేషన్ షాపులకు వెళ్లి ఈ కేవైసీ చేయించుకునేందుకు కార్డు సభ్యులు ఆసక్తి చూపకపోవడం, కుటుంబ సభ్యులు అందుబాటులో లేకపోవడం వంటి పలు కారణాలతో మార్చి 31 నాటికి పూర్తి కావాల్సిన ప్రక్రియ ముందుకు సాగలేదు. దీంతో ప్రభుత్వం గడువును మరో నెల రోజులకు పెంచింది. ఏప్రిల్ 30 వరకూ జరిగే ఈ ప్రక్రియలో కార్డు దారులకు మరింత వెసులుబాటు కల్పించేలా ఎండీయూ వాహనాల వద్దే ఈ- కేవైసీ చేయించుకునే సదుపాయం కల్పించారు.



ఈ-కేవైసీ పూర్తయినవి పచ్చరంగు, పెండింగ్ ఎరుపు రంగులో

గుంటూరు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లాలో 5,99,558, పల్నాడు జిల్లాలో 6,45,126, బాపట్ల జిల్లాలో 4,86,151 కార్డుల చొప్పున మూడు జిల్లాల్లో 17,30,835 రేషన్ కార్డులు ఉన్నాయి. వాటిపై 48,63,305 మందికి రేషన్ అందుతోంది. వీరిలో మూడు జిల్లాల్లో 5 లక్షల పేర్ల వరకూ పెండింగ్ ఉన్నట్లుగా తెలుస్తోంది. ఈ- కేవైసీ ప్రక్రియ గతంలో జరిగిన సమయంలో చిన్నారుల వేలు ముద్రలు పడకపోవడం వంటి కారణాలతో ఐదేళ్లలోపు చిన్నారులకు ఆధార్ నెంబర్‌తో పేర్లను కార్డులో జత చేశారు. అయితే ఇప్పుడు వారిలో ఐదేళ్లు దాటినవారు ఉంటే వారి చేత ఈ- కేవైసీ చేయిస్తున్నారు. వారితోపాటు వలస పనులకు వెళ్లినవారు అనేక మంది ఈ- కేవైసీ చేయించుకోలేకపోయారు. వారికి కూడా ఈసారి అవకాశం కల్పించారు. వారు తాము పనిచేసే ప్రాంతాల్లోనే మీ-సేవ, ఈ- సేవా కేంద్రాలకు వెళ్లి ఈ- కేవైసీ చేయించుకునే అవకాశం కల్పించారు. అయితే కిందటి నెల ఈ- కేవైసీ బాధ్యతను రేషన్ డీలర్లకు అప్పగించారు. రేషన్ సరుకులు ఇళ్లకే వస్తున్న నేపథ్యంలో ప్రత్యేకంగా పనిగట్టుకుని రేషన్ షాపులకు వెళ్లాల్సి రావడంతో ఎవరూ పెద్దగా ఆసక్తి చూపలేదు. దీంతో ప్రక్రియ మందకొడిగా సాగింది. ఈ నెల రేషన్ సరుకులు ఇచ్చే సమయంలోనే ఎండీయూ వాహనం వద్దే ఈ- కేవైసీ చేయించుకునేందుకు అవకాశం కల్పించడంతో ప్రక్రియ ముందుకు సాగుతుందని అధికారులు భావిస్తున్నారు.

● సంక్షేమ పథకాల కోసం తప్పుకున్న కొందరు..

రేషన్ కార్డులో పేర్లు ఉండి ప్రభుత్వ ఉద్యోగం పొందినవారు, ఇతర ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందేవారు, ఇన్‌కమ్ టాక్స్ చెల్లింపుదారులు, నాలుగు చక్రాల వాహనదారులు చాలా మంది గత ప్రభుత్వ ఏరివేత విధానాల కారణంగా ఈ కేవైసీకి దూరంగా ఉన్నారు. కార్డు సభ్యుడిగా ఈ- కేవైసీ చేయించుకుంటే ఆ పథకాలు దూరమవుతాయన్న కారణంగా తప్పుకున్నారు. అలాంటి వారందరితో తప్పనిసరిగా ఈ- కేవైసీ చేయించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఇప్పుడు కూడా ఈ- కేవైసీ చేయించుకోకపోతే రేషన్ కట్ చేస్తామని అధికారులు తేల్చి చెబుతున్నారు.

● ఈ- కేవైసీ ఇలా..

ఎండీయూ వాహనాల వద్ద రేషన్ తీసుకునే సమయంలో ఈపోస్ యంత్రంలో ఆయా కార్డుల్లో నమోదైన సభ్యుల పేర్లు స్ర్కీన్‌పై వస్తాయి. ఈ- కేవైసీ పూర్తయిన సభ్యుల వివరాల వద్ద పచ్చరంగు బార్ వస్తుంది. ఈ కేవైసీ స్టేటస్ వద్ద వెరిఫైడ్ అని వస్తుంది. ఈ- కేవైసీ పెండింగ్ ఉన్న పేర్ల వద్ద ఎర్ర రంగు బార్ వస్తుంది. ఈ కేవైసీ పెండింగ్ అని చూపుతుంది. అలా ఈ- కేవైసీ పెండింగ్ ఉన్నవారు అక్కడే బయోమెట్రిక్ ద్వారా ఈ- కేవైసీ ప్రక్రియను పూర్తి చేసుకోవచ్చు.

● ఈనెల కూడా కనిపించని కందిపప్పు

కూటమి ప్రభుత్వం వచ్చాక రెండు మూడు నెలలపాటు అందుబాటులోకి వచ్చిన కందిపప్పు, జొన్నలు, రాగులు మూడు నెలలుగా కనిపించడం లేదు. ఈ నెల నుంచి కందిపప్పు పంపిణీ పునఃప్రారంభమవుతుందన్న ప్రచారం విస్తృతంగా జరిగింది. దీంతో అనేక మంది లబ్ధిదారులు కందిపప్పు కోసం ఎదురు చూశారు. కానీ ఈ నెల కూడా కందిపప్పు రాలేదు. దీంతో కార్డుదారులు నిరాశ చెందారు. కందిపప్పు ధర మండిపోతున్న తరుణంలో చౌకధరలో ప్రభుత్వం సరఫరా చేయాలని కోరుతున్నారు.

పల్లె యవనికపై కళాసౌరభం

రేపటి నుంచి పుచ్చలపల్లి సుందరయ్య జాతీయస్థాయి నాటకోత్సవాలు

యడ్లపాడులో మూడు రోజులపాటు నిర్వహణ



యడ్లపాడులోని పుచ్చలపల్లి సుందరయ్య కళాప్రాంగణం, ప్రాంగణంలోని ఎంవీ చౌదరి కళావేదిక

యడ్లపాడు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : కళలు సంస్కృతికి ప్రతిబింబాలు..కళాకారులు సమాజాన్ని జాగృతం చేసే దివిటీలు.. కళాపరిషత్‌లు వాటికి జవసత్వాలు అందించే జీవనదులు. సినిమా, టీవీ, షార్ట్ ఫిల్మ్‌లు ఎంతగా వృద్ధిచెందినా వాటి మూలాలు మాత్రం నాటక రంగస్థలమే. కళలతోనే జీవితం.. కళలే వారి జీవితం అనుకునే తెలుగు కళామతల్లి ముద్దుబిడ్డలకు సాంస్కృతిక సేవా నిలయంగా నిలుస్తోంది యడ్లపాడులోని పుచ్చలపల్లి సుందరయ్య కళానిలయం. కళ కళకోసం కాదు.. సమాజ హితం కోసం అంటూ పుచ్చలపల్లి సుందరయ్య పేరుతో రెండు దశాబ్దాలకు పైగా నాటకోత్సవాలను నిర్వహిస్తూ కళామతల్లికి సేవలందిస్తోంది పుచ్చలపల్లి కళానిలయం. తెలుగు నాటకరంగానికి జవసత్వాలు కల్పించి ప్రజలకు మరింత చేరువ చేసేందుకు నూతన ఒరవడితో ముందుకు సాగుతోంది. రేపటి (శుక్రవారం) నుంచి మూడు రోజులపాటు నిర్వహిస్తున్న పుచ్చలపల్లి సుందరయ్య కళానిలయం 22వ జాతీయస్థాయి నాటికల పోటీలపై ప్రత్యేక కథనం.

ఆదర్శనేత పుచ్చలపల్లి సుందరయ్య పేరుతో రెండు దశాబ్దాలకు పైగా నాటిక పోటీలు నిర్వహిస్తూ ఆదర్శంగా నిలుస్తోంది యడ్లపాడు పుచ్చలపల్లి సుందరయ్య కళానిలయం. గతంలో స్మారక నాటకోత్సవాలుగా మాత్రమే నిర్వహించి ప్రదర్శనా పారితోషికం మాత్రమే అందజేసేవారు. అయితే మూడేళ్ళుగా నిర్వాహకులు నాటకోత్సవాల నిర్వహణలో మార్పులు చేపట్టారు. నాటకాల పట్ల ప్రజల్లో ఆసక్తిని పెంపొందించి చేరువ చేయడంతోపాటు కళాకారులను, నాటక సమాజాలను ప్రోత్సహించేందుకు జాతీయస్థాయి నాటికల పోటీలుగా మార్పు చేశారు.



మెప్పు కాదు.. మార్పు కోసం..

కళ కళ కోసం కాదు.. ప్రగతి కోసం అని చాటి చెప్పిన మహనీయుల మాటలే ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగుతున్నాం. నాటకోత్సవాలు నిర్వహించడం కత్తి మీద సాములాంటిది. ఎన్ని వ్యయప్రయాసలు ఎదురైనా మహనీయుల మాటలు, ప్రేక్షకుల ఆదరణ ముందుకు నడిపిస్తున్నాయి. కళారంగానికి పరిపుష్టతను అందించేందుకు వినూత్నంగా, విభిన్నంగా అందరినీ ఆకట్టుకునే విధంగా పోటీలకు తగినట్లుగా ఏర్పాట్లు చేస్తున్నాం. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన లైటింగ్ ఎఫెక్ట్స్, స్టేజి అలంకరణ వేటికవే పోటీపడుతూ ప్రదర్శితమయ్యే నాటికలు వాటి ప్రత్యేకతను చాటుకుంటాయన్నారు. గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్ళి ఆహ్వాన పత్రిక, లక్కీడ్రా కూపన్లను ఇచ్చి సాదరంగా ఆహ్వానిస్తున్నాం.

-ముత్తవరపు సురేష్‌బాబు, పుచ్చలపల్లి సుందరయ్య కళానిలయం అధ్యక్షులు

ఎయిమ్స్ అభివృద్ధిపై కేంద్రమంత్రికి పెమ్మసాని వినతి



కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్‌కు వినతి పత్రాన్ని అందజేస్తున్న పెమ్మసాని

మంగళగిరి, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా మంగళగిరిలోని ఎయిమ్స్ ఆసుపత్రిలో పూర్తిస్థాయి పడకలు (960) ఏర్పాటు చేయించడంతోపాటు ఖాళీగా వున్న 1,045 పోస్టులను భర్తీ చేయించేలా చర్యలు చేపట్టాలని కేంద్ర గ్రామీణ, కమ్యూనికేషన్స్‌శాఖ సహాయమంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ బుధవారం కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బుధవారం ఢిల్లీలోని మంత్రి కార్యాలయంలో పెమ్మసాని ఆమెను కలుసుకుని వినతిపత్రాన్ని అందజేశారు. ఈ ప్రక్రియను పూర్తి చేసేందుకు ఏటా అయ్యే రూ.250 కోట్ల ఖర్చును కేంద్రం అదనంగా భరించేలా ఆర్థికమంత్రి తగు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. గత నెల 28న డాక్టర్ పెమ్మసాని మంగళగిరి ఎయిమ్స్ ఆసుపత్రిలో జరిగిన సమీక్షా సమావేశంలో పాల్గొన్న సందర్భంగా సిబ్బంది ఆయన దృష్టికి ఆయా సమస్యలను తీసుకువెళ్లారు. దీంతో ఆయన ఈ సమస్యలను కేంద్ర ఆర్థికశాఖమంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. ఆసుపత్రిలో 105 ఫ్యాకల్టీ, సీనియర్ అసిస్టెంట్, జూనియర్ రెసిడెంట్, నర్సింగ్ కేడర్, నాన్ ఫ్యాకల్టీ పోస్టులు ఖాళీగా ఉన్నాయని వినతిపత్రంలో వివరించారు. అలాగే సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ కమిటీ మంగళగిరి ఎయిమ్స్‌కు కేటాయించిన మొత్తం 960 పడకలను కూడా పూర్తిస్థాయిలో సత్వరమే అందుబాటులోకి తేవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. డాక్టర్ పెమ్మసాని ప్రతిపాదనలపై ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ సానుకూలంగా స్పందిస్తూ ఆంధ్రప్రదేశ్ అభ్యున్నతికి మోదీ, ఎన్డీఏ కూటమి ప్రభుత్వాలు ఎల్లప్పుడూ సహకరిస్తాయని...తప్పక తనవంతు సహకారం అందిస్తానని ఆమె భరోసాను ఇచ్చినట్టు డాక్టర్ పెమ్మసాని తెలిపారు.

గుంటూరు రైల్వే డివిజన్ చరిత్రలో...

3.451 మిలియన్ టన్నుల సరుకు రవాణా

గుంటూరు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): సరుకు రవాణా విషయంలో గుంటూరు రైల్వే డివిజన్ సరికొత్త రికార్డు సృష్టించింది. డివిజన్ ఏర్పడిన తర్వాత ప్రప్రథమంగా 3.451 మిలియన్ టన్నుల సరుకులను రవాణా చేసి గత రికార్డులను తిరగరాసింది. గత ఏడాది 3 మిలియన్ టన్నులను దాటి కొంతమేరకే సరుకులను లోడింగ్ చేయగలిగింది. ఈ ఏడాది మరింత జోరుగా రవాణా చేయడంతో రికార్డు నెలకొల్పినట్లు అయిది. ఇందుకోసం పటిష్టమైన ప్రణాళిక, సిబ్బంది అంకితభావం, టీం వర్క్ తోడైంది. ముఖ్యంగా కమర్షియల్, ఆపరేటింగ్ విభాగాలు సమన్వయంతో పని చేశాయని వాటి విభాగాల అధికారులను డీఆర్ఎం రామ కృష్ణ అభినందించారు. 2024-25 ఆర్థిక సంవత్స రంలో మరికొన్ని విజయాలు కూడా డివిజన్ సా ధించింది. వాటిల్లో గత ఏడాదితో పోలిస్తే డివిజ న్‌లో రైళ్ల, గూడ్స్‌ల వేగం 20 శాతం పెరిగింది. రోలింగ్ బ్లాక్ కారిడార్ ప్రోగ్రాంలో 95.91 శాతం బ్లాక్‌లు మంజూరు చేశారు. ఇప్పటివరకు డివిజన్ మొత్తం 100 లాంగ్ హాల్స్(పొడవాటి గూడ్స్ రైళ్లు)కు సరుకులు లోడింగ్ చేసింది. రైళ్ల సమ యపాలన విషయంలో దేశంలో 10వ స్థానం, దక్షిణ మధ్య రైల్వే జోన్‌లో ప్రథమ స్థానంలో నిలవడం విశేషం.

పరుగులు పెట్టిన పడవల వేలం

◆ ఉమ్మడి జిల్లా పరిషత్ ఆదాయపు పంట ◆ ఈ ఏడాది రూ. 1.46 కోట్ల రాబడి ◆ రూ. 50 లక్షలు పలికిన దిడుగు-ఏటూరు రేవు



బహిరంగ వేలం నిర్వహిస్తున్న డిప్యూటీ సీఈవో చొప్పర కృష్ణ

గుంటూరు సిటీ, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లాలోని రేవుల్లో సంవత్సర కాలం పడవలు నడుపుకునేందుకు నిర్వహించిన వేలం పాటలు పరుగులు పెట్టాయి. జిల్లా పరిషత్ సీఈవో జ్యోతి బసు, డిప్యూటీ సీఈవో చొప్పర కృష్ణ ఆధ్వర్యంలో బుధవారం గుంటూరులోని జిల్లా పరిషత్ కార్యాలయంలో ఈ పాటలు నిర్వహించారు. వేలం పాటలో పాల్గొనేందుకు ఉమ్మడి జిల్లాలోని వివిధ మండలాల నుంచి ఎక్కువ మంది హాజరయ్యారు. అన్ని రేవులకు అధిక మొత్తంలో ఆదాయం వచ్చింది. అధికారులు ఊహించిన దానికంటే ఎక్కువ ఆదాయం వచ్చినట్లుగా తెలుస్తోంది. అమరావతి మండలంలోని దిడుగు-ఏటూరు రేవుకు ఎక్కువ మంది పోటీ పడ్డారు.ఈ రేవులో పడవ నడుపుకునే హక్కు కోసం రూ. 50 లక్షలు చెల్లించేందుకు ముందుకు వచ్చారు. అచ్చంపేట మండలంలోని చామర్రు-కాసరబాద రేవుకు రూ.5,15,000, గింజుపల్లి-వేద్రాద్రి రేవుకు రూ. 14 లక్షలు, తాడువాయి-రామన్నపేట రేవుకు రూ.21 లక్షలు,మాడిపాడు-ముక్త్యాల రేవుకు రూ.30 లక్షల 15 వేలు, పుట్లగూడెం- రామన్నపేట రేవుకు రూ.24.66 లక్షలు, ధరనికోట-కునికినిపాడు రేవుకు రూ. 1.9 లక్షలు చొప్పున చెల్లించి పడవ నడిపే హక్కులు దక్కించుకున్నారు.అచ్చంపేట మండలం లోని చింతపల్లి-ఇస్నేపల్లి, మాడిపాడు-బుగ్గమాదారం, మాచవరం మండలంలోని గోవిందాపురం-చింతిర్యాల, కొల్లిపొర మండలంలోని వల్లభాపురం-వల్లూరి పాలెం రేవుల వేలం పాటలు వాయిదా పడ్డాయి. బల్లకట్టుల హక్కులు పాడుకునేందుకు ఎవరూ ముందుకు రాలేదు. ప్రస్తుతం నిర్వహించిన వేలం పాటల వల్ల జిల్లా పరిషత్‌కు ఈ ఏడాది రూ.1.46 కోట్ల ఆదాయం వచ్చింది.



ఇది మల్లెల వేళయనీ

- పెదవడ్లపూడి, నూతక్కి ప్రాంతాల్లో అత్యధికంగా మల్లెతోటల సాగు
- వేలాది మందికి ఉపాధి అవకాశాలు

బాపట్ల, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో మల్లె తోటల సోయగం చూడముచ్చటగా ఉంది. సువాసన వెదజల్లే మల్లెతోటల సాగుపట్ల సన్న,చిన్నకారు రైతులు ఆసక్తి చూపుతున్నారు. 10 సెంట్ల భూమి దగ్గర నుంచి ఎకరాలలో కూడా దీనిని సాగు చేస్తున్నారు. బాపట్ల మండలం వెదుళ్ళపల్లి, స్టూవర్టుపురం,బేతపూడి, దరివాదకొత్తపాలెం తదితర గరువు భూములలో సాగు చేస్తున్న తోటల్లో మల్లెపూలు విస్తారంగా పూస్తున్నాయి. జిల్లాలో 507 ఎకరాలలో దీనిని సాగు చేస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. అనధికారికంగా ఎంతో సాగు చేస్తున్నారు. మహిళల మనస్సుల్ని దోచే మల్లెపూలతోటలు జిల్లాలో మంచి దిగుబడి ఇస్తున్నాయి. ఈతోటలపై వేలాదిమంది జీవనోపాధి పొందుతున్నారు. బాపట్లప్రాంతంలో 20గ్రామాలు, రేపల్లె ప్రాంతంలో 20గ్రామాలలో, ఉమ్మడి గుంటూరుజిల్లాలో అత్యధికంగా పెదవడ్లపూడి, నూతక్కి గ్రామాలలో మల్లెల సాగు చేస్తున్నారు. ఆ తర్వాత బాపట్లప్రాంతంలో ఎక్కువగా సాగు చేస్తున్నారు. మల్లెపూల సోయగాలతో జిల్లాలోని చాలా ప్రాంతాలు విస్తరించాయి. వెదుళ్ళపల్లి పూలమార్కెట్ నుంచి పెద్దఎత్తున ఇతర ప్రాంతాలకు మల్లెపూలు ఎగుమతి అవుతున్నాయి. ఎంతోకాలంగా ఇక్కడ నుంచి లక్షల రూపాయల మార్కెట్ జరుగుతున్నది.

మల్లెతోటలకు ఆశిస్తున్న తెగుళ్ళు

చూడముచ్చటైన మల్లెతోటలపై కూడా తెగుళ్ళ ప్రభావం ఉంది. ప్రస్తుతం ఎర్రమొగ్గ, రెడ్‌స్పైడర్‌మైట్, ఎర్రనల్లి, ఎండుకొమ్మలు కనిపిస్తున్నాయి. వీటి నివారణకు సస్యరక్షణ చర్యలు చేపడితేనే దిగుబడులు పెరుగుతాయి. లేకుం టే గణనీయంగా తగ్గే అవకాశం ఉంది. కావున రైతులు అప్రమత్తంగా ఉండాలని ఉద్యానవనశాఖాధికారులు తెలియజేస్తున్నారు.

సస్య రక్షణ చర్యలు చేపట్టాలి
పీ జెన్నెమ్మ, జిల్లా ఉద్యానశాఖాధికారి



ఇసుకనేలలో మల్లెసాగు చేస్తున్నారు కాబట్టి కొన్నిచోట్ల ఎర్రమొగ్గ కనిపిస్తున్నది. దీని నివారణకు వర్మికంపోస్ట్ అధికంగా వాడటంతోపాటు క్లోరిపైరీఫాస్ రెండు మిల్లీలీటర్లు లీటరు నీటిలో కలిపి పిచికారి చేసుకోవాలి. ఎండికొమ్మలు కనిపిస్తే కాపర్ ఆక్సీక్లోరైడ్ 3గ్రాములు లీటరు నీటికి చొప్పున, ఎర్రనల్లి, రెడ్‌స్పైడర్‌మైట్ కనిపిస్తే సల్ఫర్ 2గ్రాములు లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారి చేసి నివారించుకోవాలి.



బాపట్ల మండలంలో సాగు చేస్తున్న మల్లెతోటలు

కార్పొరేట్ సంస్థలకు ధీటుగా సోనోవిజన్ వ్యాపార సేవలు

- గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి
- కోలాహలంగా సోనోవిజన్ లక్కీడ్రా



సోనోవిజన్ లక్కీడ్రా తీస్తున్న ఎమ్మెల్యే గళ్లా మాధవి పక్కన సంస్థ ఎండీ భాస్కరమూర్తి తదితరులు



విజేతను ప్రకటిస్తున్న ఎమ్మెల్యే గళ్లా మాధవి, పక్కన సంస్థ ఎండీ భాస్కరమూర్తి తదితరులు

గుంటూరు, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): మార్కెట్లో కార్పొరేట్ సంస్థలకు ధీటు గా సోనోవిజన్ వ్యాపార సేవలు అందించటం అభినందనీయమని పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి ప్రశంసించారు. గుంటూరు లక్ష్మీపురం మెయిన్ రోడ్డులోని సోనోవిజన్ షోరూంలో సంస్థ మేనేజింగ్ డైరక్టర్ పీ భాస్కరమూర్తి నేతృత్వంలో లక్కీ డ్రా కార్యక్రమం బుధవారం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే గళ్లా మాధవి నగరంలోని నాలుగు షోరూమ్‌లలో కొనుగోలుదారుల కూపన్‌లను లక్కీ డ్రాలో తీసి విజేతలను ప్రకటించారు. మొదటి విజేతగా సెల్‌ఫోన్‌ను కొనుగోలు చేసిన ఏటి అగ్రహారంనకు చెందిన నరసింహారావును (కూపన్ నెంబరు 66608) ప్రకటించారు. తొలి విజేతగా ఆయనకు మారుతీ సుజుకీ ఆల్టో 800 కారును అందజేయనున్నట్లు తెలిపారు. అలానే రెండో కూపన్‌ను ఖాతాదారులతో డ్రా తీసి నగరానికి చెందిన అభిరామ్‌ను (కూపన్ నెంబరు 24387) ప్రకటించారు. రెండో విజేతకు ఎల్ఈడీ టీవీ అందజేయనున్నట్లు పేర్కొన్నారు. అలానే మూడో విజేత సీహెచ్ ఆనంద్‌స్వరూప్ (కూపన్ నెంబరు 77611) కు రిఫ్రిజరేటర్ అందజేయనున్నట్లు చెప్పారు. నాలుగో విజేతగా జీ శ్రీనివాసరావు (కూపన్ నెంబరు 164470) వాషింగ్ మిషన్‌ను అందజేయనున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవి మాట్లాడుతూ ఎంతో ప్రజాదరణతోనే ఐదు దశాబ్దాలకు పైగా సోనోవిజన్ సుదీర్ఘ వ్యాపార ప్రయాణం చేయగలిగిం దన్నారు. సామాన్య, మధ్యతరగతి ప్రజలకు అందుబాటు ధరల్లో నాణ్యమైన ఎలక్ట్రానిక్ గృహోపకరణాలను అందజేయటం సంతోషదాయకమన్నారు. మరింత వ్యాపారాభివృద్ధి జరగాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. సోనోవిజన్ ఎండీ పీ భాస్కరమూర్తి మాట్లాడుతూ 1969లో సోనోవిజన్‌ను స్థాపించి 56 ఏళ్ళగా ప్రజలకు నాణ్యమైన, నమ్మకమైన బ్రాండ్లను అందుబాటులో ఉంచుతున్నామన్నారు. నేటికి ఎనిమిదిన్నర లక్షల మంది కొనుగోలుదారులతో తెలుగురాష్ట్రాల్లో 71 షోరూమ్‌లతో సోనోవిజన్ వ్యాపారం చేస్తుందన్నారు. సామాన్య ప్రజలకు సైతం అందుబాటు ధరల్లో ఎలక్ట్రానిక్ గృహోపకర ణాలను జీరో ఫైనాన్స్ వడ్డీతో అందజేస్తున్నామన్నారు. ప్రధానంగా క్రెడిట్ కార్డ్ అమ్మకాలను ప్రోత్సహించేందుకు క్యాష్ బ్యాక్ ఆఫర్లతో విక్రయాలు జరుపుతున్నామన్నారు. కార్యక్రమంలో బ్రాంచ్‌మేనేజర్‌లు కోనేటి వెంకటేష్, ప్రసాద్, శ్రీనివాస్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌ఫ్లూయెంజాపై అప్రమత్తంగా ఉండాలి

మంగళగిరి సిటీ, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ఇన్‌ఫ్లూయెంజా వైరస్ వ్యాప్తి పై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మంగళగిరి ఎయిమ్స్ వైద్యులు సూచించారు. ఇటీవల సంభవించిన ఇన్‌ఫ్లూయెంజా మృతి కేసుకు సంబంధించి బుధవారం ఎయిమ్స్ వైద్యుల బృందం ఒక ప్రకటన విడుదల చేసింది. పల్నాడు జిల్లాకు చెందిన రెండేళ్ల బాలిక తీవ్రమైన జ్వరం, శ్వాసకోశ సంబంధిత ఇబ్బందులతో మార్చి 4వ తేదీన ఎయిమ్స్ పీఐసీయూలో చేరింద న్నారు. ఆసుపత్రిలో చేరినప్పుడు ఆ బాలికకు లెప్టోస్పిరోసిస్ వ్యాధి ఉన్నట్లు నిర్ధారణ అయిందని, నాసోఫారింజియల్ స్వాబ్ పరీక్ష ద్వారా ఇన్‌ఫ్లూయెం జా-ఏ పాజిటివ్‌గా కూడా నిర్ధారణ అయిందని తెలిపారు. వ్యాధి రూపాంతరాలను గుర్తించడానికి నమూనాలను పూణేలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వైరాలజీకి పంపారన్నారు. ఆ తర్వాత ఏవీఎన్ ఇన్‌ఫ్లూయెంజా నిర్ధారించి తగిన వైద్య సంరక్షణ అందించినప్పటికీ దురదృష్టవశాత్తూ ఆరోగ్య పరిస్థితి క్షీణించి ఆ బాలిక మార్చి 15న మృతి చెందిందన్నారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఎలాంటి ఇన్‌ఫ్లూయెంజా కేసులు నమోదు కాలేదన్నారు. ప్రజలంతా అప్రమత్తంగా ఉండి జ్వరం, దగ్గు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు, శరీర నొప్పులు ఉన్నట్టయితే వెంటనే వైద్యులను సంప్రదించి సకాలంలో రోగ నిర్ధారణ, చికిత్స తీసుకోవాలని సూచించారు.

వినూత్న ఆలోచనలతో ఉజ్వల భవిష్యత్తు



సదస్సులో మాట్లాడుతున్న ప్రొఫెసర్ వరదరాజు

మంగళగిరి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశ నుంచే వినూత్న ఆలోచనలతో నూతన ఆవిష్కరణలకు నాంది పలకడం ద్వారా విద్యార్థులు ఉజ్వల భవిష్యత్తును పొందగలుగుతారని మద్రాస్ ఐఐటీ కెమిస్ట్రీ ప్రొఫెసర్ యూవీ వరదరాజు చెప్పారు. మంగళగిరి మండలం కాజ గ్రామంలోని జెమ్స్ పబ్లిక్ స్కూల్లో బుధవారం విద్యార్థులకు ఐఐటీపై అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఆర్‌ఎం యూనివర్సిటీ కెమిస్ట్రీ హెచ్‌వోడీ పార్థసారథి, జెమ్స్ పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపాల్ ప్రసన్నజాయ్, మేనేజర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గణనదారులకు డీఆర్‌డీఏ శిక్షణ

దుగ్గిరాల, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జీవనోపాధి ఎంపిక కోసం గణనదారులకు శిక్షణ కార్యక్రమం బుధవారం స్థానిక మండలపరిషత్ కార్యాలయావరణలో నిర్వహించారు. 2025- 26 ఆర్థిక సంవత్సరానికి గానూ, మండల సమాఖ్య తరఫున లక్ష రూపాయల చెక్కును డీఆర్‌డీఏ పీడీ టీవీ. విజయలక్ష్మికి అందించారు. తొలిరోజు శిక్షణ కార్యక్రమాన్ని ఉద్దేశించి పీడీ మాట్లాడుతూ రానున్న ఆర్థిక సంవత్సరానికి కుటుంబ జీవనోపాధి ప్రణాళికను సిద్ధం చేయాలని, జీవనోపాధులను పారిశ్రామికులు తీర్చిదిద్దేందుకు పలు అంశాలపై అవగాహన కల్పించాలని అన్నారు. డీపీసీ మురళి, స్త్రీనిధి ఇన్‌చార్జి మేనేజర్ ఆనంద్, ఏపీఎం సురేష్ కుమార్, పలువురు డ్వాక్రా యానిమేటర్లు పాల్గొన్నారు.

చేనేత సమస్యల పరిష్కారానికి 8న ధర్నా

మంగళగిరి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): చేనేత కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 8వ తేదీన రాష్ట్రంలోని అన్ని ఏడీ కార్యాలయాల వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్టు ఏపీ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లలమర్రి బాలకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. చేనేతలను కూటమి ప్రభుత్వం మోసం చేస్తుందన్నారు. చేనేత మంత్రి శాసనమండలిలోని చేనేత సహకార సంఘాలకు త్రిఫ్ట్ ఫండ్ కింద రూ.5 కోట్లు ఖర్చు చేశామని చెప్పారని, వాస్తవానికి నేటి వరకు ఆ మొత్తం విడుదల చేయలేదని అన్నారు. చేనేత కార్మికులకు ఉచిత విద్యుత్తుకు జీవో విడుదల చేసినట్టు ప్రకటించారని, విద్యుత్ కార్యాలయాలకు వెళ్లి అడిగితే పై నుంచి ఎటువంటి ఉత్తర్వులు రాలేదని చెబుతున్నారని తెలిపారు. ఆయా సమస్యల పరిష్కారం కోరుతూ జరిగే ధర్నాలో చేనేత కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

డ్రెయినేజీ పనుల అడ్డగింత

మంగళగిరి సిటీ, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి టిడ్కో సముదాయం వద్ద జరుగుతున్న డ్రెయినేజీ నిర్మాణ పనులను స్థానికులు బుధవారం రాత్రి అడ్డుకున్నారు. టిడ్కో సముదాయం వెనుక వున్న రాజీవ్ గృహకల్ప నుంచి టిడ్కో వైపు నిర్మిస్తున్న డ్రెయిన్ పనులను అడ్డుకుని నిరసన వ్యక్తం చేశారు. సీ2, సీ3, సీ4 బ్లాకుల పక్కనే గత ఎమ్మెల్యే మరుగుదొడ్లు కట్టించారని, ఆ దుర్వాసన నుంచి తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని చెప్పారు. ఇప్పుడు రాజీవ్ గృహకల్ప నుంచి సెప్టిక్, డ్రెయినేజీ వాటర్‌ను టిడ్కో మీదుగా పంపించేందుకు కాలువ తవ్వుతున్నారని తెలిపారు. డ్రెయినేజీ నిర్మాణం తక్షణమే నిలుపుదల చేసి తమ ఆరోగ్యాన్ని కాపాడాలని స్థానికులు అధికారులకు విజ్ఞప్తి చేశారు.

సౌపాడులో వీధికుక్కల దాడి

● 8మందికి తీవ్ర గాయాలు

వట్టిచెరుకూరు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సౌపాడు గ్రామంలో బుధవారం రాత్రి 8 గంటలు దాటిన తర్వాత ఐదారు వీధి కుక్కలు స్వైరవిహారం చేశాయి. ఆ సమ యంలో అటుగా వెళుతున్న పలువురిని తీవ్రంగా గాయపరిచాయి. గ్రామానికి చెందిన తాటి మస్తాన్, బుల్లెయ్య, గండు సాంబయ్య అనే వృద్ధులు, పరమేశ్వరరావు, శివయ్య, 12 ఏళ్ల బాలికను మూకుమ్మడిగా వీధి శునకాలు దాడి చేసి గాయపరిచాయి. దీంతో గ్రామస్థులు వెంటనే అప్రమత్తమై వాటిని అక్కడి నుంచి తరిమేశారు. గాయపడిన వారిని 108లో గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు.

నేడు ఉండవల్లిలో 'మన ఇల్లు - మన లోకేశ్'

● దశాబ్దాల సమస్యకు పరిష్కారం
● పేదలకు శాశ్వత పట్టాలు అందజేత



ఉండవల్లి అమరారెడ్డినగర్‌లో నివసిస్తున్న గోవిందు కుటుంబం

తాడేపల్లి (ఉండవల్లి), ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి నియోజకవర్గ ప్రజలు ఎదుర్కొంటున్న దశాబ్దాల సమస్యకు పది నెలల్లో మంత్రి లోకేశ్ పరిష్కారం చూపారు. మొదటి విడత ప్రభుత్వ స్థలాల్లో నివసిస్తున్న మూడు వేల మందికి శాశ్వత పట్టాలను లోకేశ్ అందజేయనున్నారు. తొలుతగా ఏప్రిల్ 3న మొదటి పట్టాను ఉండవల్లి గ్రామంలో స్వయంగా లబ్ధిదారుల నివాసానికి వెళ్లి పట్టా అందజేసి మన ఇల్లు - మన లోకేశ్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించనున్నారు. ఏప్రిల్ 3వ ఉదయం 10.59 గంటలకు ఉండవల్లి అమరారెడ్డి నగర్‌లో ఉంటున్న రాజమండ్రి గోవిందు సీతామహాలక్ష్మి దంపతులకు అందజేయనున్నారు. వేలాది మంది ప్రజలు దశాబ్దాలుగా ప్రభుత్వ స్థలాల్లో చిన్న ఇల్లు నిర్మించుకుని నివాసం ఉంటున్నారు. వీరంతా కాయకష్టం చేసుకుని రోజువారీ పనులు చేసుకుంటూ ఇల్లు నిర్మించుకున్నప్పటికీ వారికి ఎటువంటి అధికారిక హక్కులు లేకపోవడంతో తమకు పట్టాలు ఇప్పించాలని ఏళ్ల తరబడి అధికారులు, ప్రజాప్రతినిధుల చుట్టూ తిరిగినా పట్టించుకున్న నాధుడు కరువయ్యాడు. ఎన్నికల సమయంలో లోకేశ్ దృష్టికి తమ సమస్యను తీసుకురావడంతో అధికారంలోకి వచ్చిన వెంటనే పరిష్కారం చూపుతానని లోకేశ్ నాడు హామీ ఇచ్చారు. సదరు హామీ అమలుకు లోకేశ్ కార్యాచరణ రూపొందించి సంబంధిత అధికారులతో చర్చలు జరిపారు. అంతేకాకుండా ఢిల్లీ పర్యటనకు వెళ్లినప్పుడు రైల్వే శాఖ మంత్రి అశ్వనీ వైష్ణవ్ ఇతర రైల్వే అధికారులతో మాట్లాడి తమ నియోజకవర్గంలో నిరుపయోగంగా ఉన్న రైల్వే భూములను పేదలకు ఇవ్వాల్సిందిగా పదేపదే విజ్ఞాపనలు చేస్తూ వచ్చారు. ఇతర శాఖల నిబంధనల మేరకు భూమికి భూమి ఇస్తామని మాట్లాడారు. మంత్రి లోకేశ్ చొరవతో పేదలు ఎదుర్కొంటున్న మొండి సమస్యకు తొలిదశ పరిష్కారం లభించింది. 15 ఏళ్ల క్రితం ఉండవల్లి అమరారెడ్డినగర్‌లో కొండ పోరంబోకు స్థలంలో ఇల్లు నిర్మించుకుని ఉంటున్న రజక కుటుంబానికి చెందిన గోవిందు డ్రైవర్‌గా పనిచేస్తుండగా భార్య సీతామహాలక్ష్మి బట్టలు ఉతకడం, ఇస్త్రీ పనులు చేస్తూ బిడ్డలను పోషించుకుంటున్నారు. గోవిందు కుటుంబానికి లోకేశ్ పట్టా అందజేయనున్న విషయాన్ని అధికారులు చెప్పడంతో వారి ఆనందానికి అవధులు లేకుండా పోయింది.

లోకేశ్ సాయాన్ని మరువలేం : గోవిందు

మంత్రి లోకేశ్ చేస్తున్న ఈ సాయాన్ని మరువలేమని, జీవితంలో మర్చిపోలేమని పట్టా అందుకోనున్న రాజమండ్రి గోవిందు వ్యాఖ్యానించారు. ఏళ్లతరబడి మేము ఎదుర్కొంటున్న కష్టాన్ని గుర్తించి కుటుంబసభ్యుడి మాదిరిగా సమస్య పరిష్కరించి మేము ఉంటున్న స్థలంపై హక్కులు కల్పిస్తున్నారని లోకేశ్‌కు జీవితాంతం రుణపడి ఉంటామని చెప్పారు.

4 నుంచి లబ్ధిదారులకు పట్టాలు

ఈనెల 4వ తేదీ నుంచి మంగళగిరి డాన్ బాస్కో స్కూలును ఆనుకుని ఉన్న ఖాళీ స్థలంలో ఏర్పాటు చేస్తున్న వేదికపై లబ్ధిదారులకు నారా లోకేశ్ ఇళ్ల పట్టాలు అందజేయనున్నారు. ఏప్రిల్ 4న యర్రబాలెం, నీరుకొండ, కాజ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు ఇళ్లపట్టాలు అందజేయనున్నారు. ఏప్రిల్ 7న పెనుమాక, ఉండవల్లి, ఇప్పటం, కొలనుకొండ, పద్మశాలి బజార్ ప్రాంతాలకు చెందిన లబ్ధిదారులకు పట్టాలు అందజేస్తారు. ఏప్రిల్ 8న రత్నాలచెరువు, మహానాడు 2కు చెందిన లబ్ధిదారులకు పట్టాలు అందజేస్తారు. ఏప్రిల్ 11న సీతానగరం సలాం సెంటర్ డ్రైవర్స్ కాలనీకి చెందిన లబ్ధిదారులకు, 12న మహానాడు 1, ఉండవల్లి సెంటర్ ప్రాంతాలకు చెందిన లబ్ధిదారులకు మంత్రి లోకేశ్ ఇళ్లపట్టాలు అందజేయనున్నారు. కాగా గతంలో ఎప్పుడు ఎవరి ఇళ్లపైకి ప్రొక్లెయినర్లు పంపుతారో తెలియక బిక్కుబిక్కుమంటూ కాలం గడిపిన మంగళగిరి నియోజకవర్గ ప్రజలు లోకేశ్ చొరవతో స్వేచ్ఛావాయువులు పీల్చుకుంటున్నారు. దీర్ఘకాలిక మొండి సమస్యకు పరిష్కారం చూపి శాశ్వత హక్కు సైతం కల్పిస్తుండడంతో లబ్ధిదారులు ఆనందంగా ఉన్నారు.

ఎమ్మెల్యే గ్రీవెన్స్‌డే.. సమస్యలపై బాధితుల అర్జీలు



అర్జీలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్

తాడికొండ, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యలు తెలుసుకొని అధికారుల దృష్టికి తీసుకువెళ్లి అప్పటికప్పుడు సమస్యలు పరిష్కారించటానికే నియోజకవర్గంలోని ప్రతి మండలంలో గ్రీవెన్స్‌ను నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ తెలిపారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు ఎమ్మెల్యే గ్రీవెన్స్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా పలు గ్రామాల నుంచి ప్రజలు తమ సమస్యలు పరిష్కరించాలని అర్జీలను పెట్టుకున్నారు. తాడికొండలో స్కాట్స్ అండ్ గైడ్స్ సమీపంలో లోవోల్టేజ్ సమస్య ఎక్కువగా ఉందని, ఎస్సీ కాలనీలో డ్రైనేజ్, సీసీ రోడ్లు లేవని అర్జీలు ఇవ్వగా వెంటనే స్పందించిన ఎమ్మెల్యే సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలు పరిష్కారమయ్యే విధంగా చూడాలన్నారు. రెవెన్యూ సమస్యలు, సర్వే సమస్యలు ఎక్కువగా రావటంతో వాటిని సత్వరమే పరిష్కరించాలని తహసీల్దార్‌కు ఆదేశాలు జారీ చేశారు. రావెలలో భూములకు రీసర్వే చేస్తున్నట్లు తెలిపారు. తాతిరెడ్డిపాలెంలోని మసీదు కింద 5 సెంట్ల స్థలాన్ని కేటాంచి మసీదు అభివృద్ధికి కృషి చేయాలని ముస్లిం శ్మశానంలోకి సీసీ రోడ్డు, బోరు, విద్యుత్ కనెక్షన్ వేయించాలని ముస్లింలు కోరారు. తాడికొండలోనీ ఈస్ట్ ముస్లింల కాలనీలోని షాదీఖానా నిర్మాణానికి రూ.40 లక్షల నిదులు మంజూరు చేయాలని ఎమ్మెల్యేకు అర్జీని ఇచ్చారు. మోతడక ఎస్సీ కాలనీలో నీళ్ల సక్రమంగా రావటం లేదని టీడీపీ నాయకులు తెలిపారు. స్పందించిన ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్ ఆర్‌డబ్ల్యూఎస్ డీఈతో మాట్లాడి మంచినీటి సమస్యను తీర్చాలని ఆదేశించారు. వితంతువు పెన్షన్ రావటం లేదని, తాడికొండలో అన్న క్యాంటిన్ ప్రారంభించాలని, విద్యుత్ సమస్యలు తీర్చాలని, యాక్సిడెంట్‌లో చనిపోయిన వారిని ప్రభుత్వం ఆదుకోవాలని ప్రజలు అర్జీలు ఇచ్చారు. సమస్యలపై వచ్చిన అర్జీలను సత్వరమే పరిష్కరిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు తలశిల ప్రసన్నకుమార్, బీజేపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ కంతేటి బ్రహ్మయ్య, జనసేనపార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ బేతపూడి రాజశేఖర్, టీడీపీ సీనియర్ నాయకులు ఎద్దూరి హనుమంతరావు, కంచర్ల శివరామయ్య, గుంటుపల్లి మధుసూదనరావు, నీలాల కృష్ణారావు, గడ్డిపాటి సాంబశివరావు, సాంబశివరావు, అనూఫ్, షేక్ సుభాని, తహసీల్దార్ మెహర్‌కుమార్, ఎంపీడీవో సమతావాణి, సీఐ కే.వాసు, రెవెన్యూ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అర్హులందరికీ జాబ్ కార్డులు

● నూతన ఏపీవో సుభాషిణి



బాధ్యతలు స్వీకరిస్తున్న ఏపీవో సుభాషిణి

కాకుమాను, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): మండలంలో అర్హులందరికీ జాబ్ కార్డులు, ఇవ్వడమే లక్ష్యంగా పని చేస్తానని నూతన ఏపీవో సుభాషిణి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం కాకుమాను మండల జాతీయ ఉపాధి హామీ పథకం ఏపీవోగా బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఇక్కడ విధులు నిర్వహించిన సింగారావు పొన్నూరు బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా నూతన ఏపీవో సుభాషిణి మాట్లాడుతూ జాబ్ కార్డులు ఉన్న వారికి ఉపాధి హామీ పథకం ద్వారా పని కల్పించేందుకు కృషి చేస్తానన్నారు. ఎంపీడీవో యుగకీర్తిని ఆమె మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

తుళ్లూరు సీఐగా శ్రీనివాసరావు బాధ్యతల స్వీకరణ



శ్రీనివాసరావు

తుళ్లూరు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) తుళ్లూరు పోలీసుస్టేషన్ సీఐ-1 కొంకా శ్రీనివాసరావు బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇంతకు ముందు సీఐగా పనిచేసిన గంగా వెంకటేశ్వర్లు గుంటూరు పట్టాభిపురం స్టేషన్‌కు బదిలీ అయ్యారు. రాజధాని ప్రాంతంలో శాంతి భద్రతలకు భంగం వాటిల్లకుండా తగిన చర్యలు తీసుకుంటామని శ్రీనివాసరావు ఈ సందర్భంగా పేర్కొన్నారు.

క్లాప్ ఆటోడ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలి

మంగళగిరి సిటీ, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ఎంటీఎంసీ పరిధిలో పనిచేస్తున్న క్లాప్ ఆటో డ్రైవర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ నేత చెంగయ్య డిమాండ్ చేశారు. మంగళగిరి సీఐటీయూ కార్యాలయంలో బుధవారం సాయంత్రం జరిగిన క్లాప్ ఆటోడ్రైవర్ల విస్తృత సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆటోడ్రైవర్లకు రెండు నెలలుగా కాంట్రాక్టర్ వేతనాలు చెల్లించడంలేదన్నారు. 16 నెలలుగా ఈఎస్‌ఐ, పీఎఫ్ అమలు కావడంలేదని, సదరు కాంట్రాక్టర్ ఆ మొత్తాన్ని తన ఖాతాలో వేసుకుంటున్నాడని ఆరోపించారు. ఈ సమస్యలపై ఈనెల 3వ తేదీన కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తామన్నారు.

సమస్యలతో అట్టుడికిన సర్వసభ్య సమావేశం

● పింఛన్లు ఎందుకు ఆపారంటూ ఎంపీడీవోపై సర్పంచుల ప్రశ్నలు
● వీవోఏల అవినీతిపై సమగ్ర విచారణ జరపాలంటూ డిమాండ్



స్త్రీనిధి రుణాల విషయంలో ఏపీఎంను ప్రశ్నిస్తున్న తిమ్మాపురం సర్పంచ్ కల్లూరి శ్రీనివాసరావు

ప్రత్తిపాడు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు మండల సర్వసభ్య సమావేశం సమస్యల ప్రస్తావనలతో అట్టుడికి పోయింది. తెలుగుదేశం, వైసీపీకి చెందిన సర్పంచులు ఎంపీటీసీలు అధికారులపై ప్రశ్నల వర్షం కురిపించారు. తెలుగుదేశం పార్టీకి చెందిన తిమ్మాపురం సర్పంచ్ కల్లూరి శ్రీనివాసరావు, కోయవారిపాలెం ఎంపీటీసీ కొర్రపాటి మధులు హౌసింగ్ బిల్లులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో గృహ నిర్మాణాలు పూర్తి చేసుకున్న వారికి బిల్లులు ఇవ్వకపోవడం ఏమిటన్నారు. గత సమావేశంలో కూడా ఇదే విషయాన్ని ప్రస్తావించామని, గ్రామాల్లో లబ్ధిదారులకు తాము సమాధానం చెప్పలేక పోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. కల్లూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ పొగాకు, శనగలకు గిట్టుబాటు ధర ఇప్పించకపోతే రైతులు ఆత్మహత్యలు చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే స్త్రీనిధికి సంబంధించి మండలానికి లోన్లు రావడం లేదంటూ ఆరోపించారు. అంతే గాకుండా గతంలో అధికారుల ప్రమేయంతో వెలుగులో జరిగిన అవినీతిపై విచారణ జరిపించాలని కోరారు. వైసీపీకి చెందిన సర్పంచులు లక్ష్మారెడ్డి, నర్రా రాంబాబులు ప్రభుత్వం నుంచి విడుదలవుతున్న పింఛన్లను కావాలని ఎందుకు ఆపారంటూ ఎంపీడీవో శివపార్వతిని ప్రశ్నించారు. దివ్యాంగుల సర్టిఫికెట్స్ తేడాగా ఉన్నట్లు తనకు ఫిర్యాదులు అందాయంటూ ఆమె సమాధానం చెప్పారు. గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేస్తే మీరు గేట్ లాక్ అంటూ సమాధానం ఇచ్చారు.. ఈ విషయంలో తెలుగుదేశం పార్టీకి చెందిన సర్పంచ్ కల్లూరి శ్రీనివాసరావు కలగజేసుకుని మీరు పింఛన్లు ఆపకూడదని, ప్రభుత్వం చేస్తున్న వెరిఫికేషన్‌లో తప్పు ఉంటే ఆగిపోతాయి కదా అన్నారు. వైసీపీకి సానుభూతిపరులైన వీవోఏలను టార్గెట్ చేసి తొలగిస్తున్నారంటూ ఆ పార్టీకి చెందిన సర్పంచులు ఏపీఎం లాజర్‌ను ప్రశ్నించారు. ఆయన గ్రామైఖ్య సంఘాలే తీర్మానాలు చేశాయంటూ వివరణ ఇచ్చారు. పలు విషయాలపై చర్చ జరిగింది. కార్యక్రమంలో ఎంపీపీ దాసరి అన్నమ్మ, జడ్పీటీసీ కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

ముట్లూరు జడ్పీ హైస్కూల్ ప్రాజెక్టు రాష్ట్ర స్థాయికి ఎంపిక



రాష్ట్ర స్థాయి సైన్స్ ఎక్స్‌పోకి ఎంపికైన ముట్లూరు జడ్పీ హైస్కూల్ విద్యార్థులతో గైడ్

వట్టిచెరుకూరు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముట్లూరు జడ్పీ హైస్కూల్‌కు చెందిన సైన్స్ ప్రాజెక్టు సోలార్ స్మార్ట్ హెల్మెట్ రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్టు జడ్పీ హైస్కూల్ విద్యార్థుల గైడ్ రామాంజనేయులు వెల్లడించారు. గుంటూరు ఉర్దూ గరల్స్ హైస్కూల్లో బుధవారం జరిగిన ఈఎండీపీ ఇంటర్ ప్రొడ్యూరియల్, మైండ్ సెట్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం 2025లో ఈ ప్రాజెక్టు ద్వితీయ స్థానం పొందినట్లు గైడ్ తెలిపారు. ఇందులో పాల్గొన్న విద్యార్థులు చందుపవన్ దుర్గ, తోటకూర మహాలక్ష్మి, చందు మోక్షితలకు గైడ్ టీచర్‌గా ముట్లూరు జడ్పీ హైస్కూల్ భౌతికశాస్త్ర టీచర్ వీఎస్ రామాంజనేయులు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో గుంటూరు డీఈవో రేణుకు, డిప్యూటీ డీఈవో జీ ఏసురత్నం, డీఎస్‌వో గౌస్ మీర, ఉర్దూ డీవో ఈవో ఎండీ ఖాశిం, ఈఎండీపీ డిస్ట్రిక్ట్ కో-ఆర్డినేటర్ ఏ శర్మ పాల్గొని విజేతలైన విద్యార్థినులను గైడ్ టీచర్‌గా వ్యవహరించిన వీఎస్ రామాంజనేయులును, హెచ్‌ఎం జోష్ మేరీలను అభినందించారు.

చిర్రావూరులో వైద్యశిబిరం



వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న హబీబుల్లా ఖాన్

తాడేపల్లి (చిర్రావూరు), ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ఎంటీఎంసీ పరిధిలోని చిర్రావూరులో కేఎల్‌యూ ఎన్‌ఎస్‌ఎస్ విభాగం ఆస్టర్ రమేష్ హాస్పిటల్ అమరావతి ఐ హాస్పిటల్, బ్రేసెస్ అండ్ ఫేసెస్ డెంటల్ హాస్పిటల్ సంయుక్త ఆధ్వర్యంలో వైద్యశిబిరాన్ని బుధవారం నిర్వహించారు. ఈ శిబిరాన్ని కేఎల్‌యూ డీన్ హబీబుల్లాఖాన్ ప్రారంభించారు. కార్యక్రమంలో యూనివర్సిటి విద్యార్థి విభాగాధిపతి ప్రసాద్, వైద్యులు దీప్తి, వేణు, శైలజ, పణి భార్గవ్ తదితరులు పాల్గొన్నారు.

ఫార్మర్ రిజిస్ట్రేషన్ తప్పనిసరి : ఏవో

కాకుమాను, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ భూమి ఉన్న ప్రతి రైతు ఫార్మర్ రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా చేయించుకోవాలని మండల వ్యవసాయశాఖ అధికారి కిరణ్మయి రైతులకు సూచించారు. మండలపరిధిలోని అప్పాపురం, రేటూరు గ్రామాల్లోని రైతు సేవాకేంద్రాల్లో బుధవారం రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో కిరణ్మయి మాట్లాడుతూ మండలంలో ఎక్కువ మంది రైతులు ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని చెప్పారు. ఫార్మర్ రిజిస్ట్రేషన్ ద్వారానే ప్రభుత్వ పథకాలు అందుతాయన్నారు. అనంతరం దాళ్వా ధాన్యం రాశులను పరిశీలించారు. కార్యక్రమంలో వీఏఏలు వెంకట అప్పారావు, మహేంద్రనాయక్, రైతులు పాల్గొన్నారు.

న్యాయవాదుల గుమస్తాల సంఘ అధ్యక్ష, కార్యదర్శులుగా ధర్మారెడ్డి, ముత్తయ్య

మంగళగిరి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి కోర్టు న్యాయవాదుల గుమస్తాల సంఘాన్ని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఉయ్యూరు ధర్మారెడ్డి, కార్యదర్శిగా కట్టిపోగు ముత్తయ్య ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా వల్లభాపురం పిచ్చయ్య, జాయింటు సెక్రటరీగా అమ్మిరెడ్డి శ్రీనివాసరావు, కోశాధికారిగా దామర్ల చిరంజీవి ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా మట్టుకొయ్య సుబ్బారావు, మంచికలపూడి అంజలి, మాచర్ల నటరాజులు ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా ఏవీ రమణ వ్యవహరించారు. నూతనంగా ఎన్నికైన సంఘ సభ్యులను న్యాయవాదులు అభినందించారు.

ఈకేవైసీ త్వరగా పూర్తిచేయాలి

పెదనందిపాడు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : రేషన్ కార్డుదారులు ఈకేవైసీ త్వరితగతిన పూర్తి చేయాలని నియోజకవర్గ పౌరసరఫరాల శాఖ అధికారి శివశంకర్ అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రేషన్ డీలర్లు, ఎండీఎం ఆపరేటర్లతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో 12,000 మంది లబ్ధిదారులు ఈకేవైసీ చేయించుకోవాల్సి ఉందని లబ్ధిదారులకు డీలర్లు అవగాహన కల్పించి ఈకేవైసీ నూరుశాతం పూర్తయ్యేలా చూడాలన్నారు. సచివాలయం, రేషన్‌దుకాణాలు, ఎండీఎం వాహనాల్లో ఈకేవైసీ చేయనున్నట్లు, లబ్ధిదారులు అందరూ ఈనెల 30లోపు చేయించుకోవాలని తెలిపారు.

ప్రజా ఫిర్యాదులపై దృష్టి పెట్టాలి

● ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు



ప్రజల నుంచి వినతి పత్రాలను స్వీకరిస్తున్న బూర్ల రామాంజనేయులు

గుంటూరు (తూర్పు), ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ప్రజల నుంచి అందిన ఫిర్యాదులపై దృష్టి సారించాలని నియోజకవర్గ అధికారులను ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు ఆదేశించారు. విద్యానగర్ క్యాంపు కార్యాలయంలో బుధవారం ప్రజా ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలు రెవెన్యూ, పెన్షన్లు, సంక్షేమ పథకాలు రాని వారు ఇతర సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా రామాంజనేయులు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో భూఆక్రమణలు ఎక్కువగా జరిగాయని, చాల చోట్ల కమ్యూనిటీ భవనాలకు కేటాయించిన స్థలాలను ఆక్రమించుకున్నారని అన్నారు. క్షేత్రస్థాయిలో అధికారులు ఆక్రమణ భూములను పరిశీలించి నివేదికను రూపొందించాలని ఆదేశించారు. కార్యక్రమంలో అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

హామీల అమలు దిశగా మంత్రి లోకేశ్ అడుగులు

● ఏపీఎంఎస్ఐడీసీ చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు

మంగళగిరి సిటీ, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సందర్భంగా మంగళగిరి నియోజకవర్గ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసే దిశగా మంత్రి నారా లోకేశ్ వేగంగా చర్యలు తీసుకుంటున్నారని ఏపీఎంఎస్ఐడీసీ చైర్మన్, జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి చిల్లపల్లి శ్రీనివాసరావు తెలిపారు. మంగళగిరి జనసేన పార్టీ కార్యాలయంలో బుధవారం ఎంటీఎంసీ కమిటీ సభ్యులు, మండల అధ్యక్షులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల ముందు తనను అత్యధిక మెజార్టీతో గెలిపిస్తే ప్రభుత్వ భూముల్లో నివసిస్తున్న పేదలకు శాశ్వత హక్కు కల్పిస్తూ పట్టాలు ఇస్తానని మంత్రి లోకేశ్ హామీ ఇచ్చారని గుర్తుచేశారు. ఆ హామీని అనతి కాలంలోనే నెరవేరుస్తూ మన ఇల్లు-మన లోకేశ్ పేరిట రెగ్యులైజేషన్ చేసిన ఇళ్ల పట్టాలను పంపిణీ చేస్తున్నారని చెప్పారు. ఈ నెల 3వ తేదీన తొలి పట్టాను ఉండవల్లిలో లబ్ధిదారులకు మంత్రి లోకేశ్ స్వయంగా అందజేస్తారని చెప్పారు. ఈ సమావేశంలో జనసేన ఎంటీఎంసీ అధ్యక్షుడు మునగపాటి వెంకట మారుతీరావు, నేతలు గంజి చిరంజీవి, తిరుమలశెట్టి కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధిహామీ కూలీల నగదు చెల్లింపులో జాప్యం

● పాలపర్రులో అధికారులపై కూలీల ఆగ్రహం

పెదనందిపాడు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని పాలపర్రులో ఉపాధిహామీ పథకం కూలీల నగదు చెల్లింపులో జాప్యం జరుగుతుందంటూ కూలీలు బుధవారం అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక రైతు సేవా కేంద్రంలో కూలీలతో సమావేశం ఏర్పాటు చేశారు. గ్రామంలో ఫీల్డ్ అసిస్టెంట్ కొందరితో పనులు చేయించి నగదు చెల్లింపులు జరపలేదని, పనికి రాకుండా మంచానికే పరిమితమైన వారికి పనికి వచ్చినట్లు హాజరు వేసి నగదు చెల్లింపులు చేస్తున్నారని, ఈ నగదు ఎవరు తీసుకుంటున్నారో తమకు తెలియజేయాలన్నారు. జాబ్ కార్డు కలిగి ఉన్న వారికి మాత్రం పని కల్పించడం లేదని వాపోయారు. గతంలో పనిచేసిన ఫీల్డ్ అసిస్టెంట్ పలు అవకతవకలు పాల్పడ్డారని దీనిపై విచారణ జరపాలని కోరారు. దీనిపై ఎంపీడీవో లక్ష్మీదేవి స్పందిస్తూ లబ్ధిదారులకు తగు న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు.

యాదవ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ తాడిబోయినకు సత్కారం



యాదవ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ తాడిబోయిన భాస్కర్‌ను సత్కరిస్తున్న వల్లభనేని, దానబోయిన

తాడేపల్లిటౌన్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ యాదవ కార్పొరేషన్ డైరెక్టర్‌గా మంగళగిరి నియోజకవర్గం తాడేపల్లి పట్టణానికి చెందిన తాడి బోయిన భాస్కరరావును నియమించిన సందర్భంగా బుధవారం తాడేపల్లి టీడీపీ కార్యాలయం నుంచి టీడీపీ పట్టణ అధ్యక్షుడు వల్లభనేని వెంకట్రావు ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. బుధవారం తాడేపల్లి పట్టణ టీడీపీ కార్యాలయం నుంచి విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రం వరకు నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లి తాడిబోయిన భాస్కరరావు ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు వల్లభనేని వెంకట్రావు, రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి దానబోయిన సుందరరావుయాదవ్, టీడీపీ నాయకులు, మేకా పుల్లారెడ్డి, ఇట్టా పెంచలయ్య, కార్యకర్తలు పాల్గొన్నారు.

డీఎస్సీ-98 అభ్యర్థులకు న్యాయం చేయాలి

మంగళగిరి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వ తప్పిదాల వల్ల నష్టపోయిన 1998 డీఎస్సీ అభ్యర్థులకు న్యాయం చేయాలని ఓబీసీ జాతీయ అధ్యక్షుడు అంగిరేకుల వరప్రసాద్ కోరారు. మంగళగిరి ఐబీఎన్ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. 1998 డీఎస్సీ క్వాలిఫై అయిన వారిలో మిగిలిన వారికి కూడా వెంటనే ఉద్యోగాలు ఇవ్వాలని, మిగిలిన వారిలో చాలా మందికి మరికొద్ది నెలలు మాత్రమే వయోపరిమితి వెసులుబాటు ఉందని చెప్పారు. రాష్ట్రంలో డీఎస్సీ క్వాలిఫై అయిన అభ్యర్థులకు ఉద్యోగావకాశాలు ఉన్నాయని, వెంటనే వాటిని భర్తీ చేయాలని విజ్ఞప్తి చేశారు. అభ్యర్థుల్లో ఎక్కువగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, అగ్రకుల పేదలు ఉన్నారని చెప్పారు. మంత్రి లోకేశ్, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ స్పందించి వారికి న్యాయం చేయాలని కోరారు. సమావేశంలో డీఎస్సీ క్వాలిఫైడ్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసులు, జగ్గయ్య, చంద్రయ్య, రత్నబాబు, రామారావు, గోవిందరావు, మేరీ సుహాసిని తదితరులు పాల్గొన్నారు.

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు

పన్నుల వసూలు రూ.16.46 కోట్లు

● మునిసిపల్ కమిషనర్ బండి శేషన్న

తెనాలి, మారీసుపేట, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): పురపాలక సంఘ పరిధిలో 2024-25 ఆర్థిక సంవత్సరానికి రూ.16.46 కోట్ల పన్నులు వసూలు చేసినట్లు మునిసిపల్ కమిషనర్ బండి శేషన్న బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్థిక సంవత్సరానికి ఆస్తి పన్ను డిమాండ్ రూ.18,33,34,202.00లు ఉండగా రూ. 16,46,99,960.00లు 90శాతం వసూలు చేశామన్నారు. గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే రూ.2,48,96,383.00లు డిమాండ్ పెరిగినట్లు కమిషనర్ శేషన్న పేర్కొన్నారు.

ప్రారంభమైన సదరం రీవెరిఫికేషన్

పట్టణంలోని జిల్లా ప్రభుత్వ వైద్యశాలలో సదరం రీవెరిఫికేషన్ ప్రక్రియ బుధవారం ప్రారంభమైంది. వారంలో మూడురోజులు నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి పలు ప్రాంతాల నుంచి వివిధ విభాగాలకు దాదాపుగా 150మంది హాజరయ్యారు. వైద్యులు వారి వైకల్యశాతాన్ని పరీక్షించి ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. గురు, శుక్రవారాల్లో కూడా ఈ శిబిరం కొనసాగనుంది. పలువురు సచివాయ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

రుణమేళాకు విశేష ఆదరణ

తెనాలిరూరల్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో బీసీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రుణమేళాకు విశేషసంఖ్యలో మహిళలు హాజరయ్యారు. బ్యాంకర్లు వారి వివరాలను పరిశీలించి పేర్లు నమోదు చేసుకున్నారు. ఎంపీడీవో అత్తోట దీప్తి పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమంలో బ్యాంక్ ఉద్యోగులు, మండల కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రుణాలను సక్రమంగా చెల్లించాలి: ఏపీఎం రమాదేవి

కొల్లిపర, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): బ్యాంకు రుణాలను సక్రమంగా చెల్లించాలని డీఆర్‌డీఏ ఏపీఎం రమాదేవి అన్నారు. బుధవారం స్థానిక స్త్రీశక్తి భవనంలో డ్వాక్రా మహిళలతో ఆమె సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డ్వాక్రా గ్రూపు సభ్యులు పొదుపును సక్రమంగా చేసుకుంటే అధికంగా రుణాన్ని పొందవచ్చాన్నారు. ఆదాయ అభివృద్ధి కార్యక్రమాలకు మాత్రమే బ్యాంకు రుణాలను వినియోగించాలన్నారు. స్వయం సహాయక సంఘ సభ్యులు ప్రతి నెలా సమావేశాన్ని ఏర్పాటుచేసుకోవాలన్నారు. సమావేశంలో సీసీలు విజయకుమార్, మధు, ఎంఎస్‌ఏ సీతామహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఆలపాటి ప్రమాణ స్వీకారానికి తరలివెళ్లిన టీడీపీ శ్రేణులు

తెనాలి రూరల్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీగా ఆలపాటి రాజేంద్రప్రసాద్ ప్రమాణ స్వీకార మహోత్సవానికి తెనాలి నుంచి అమరావతికి టీడీపీ శ్రేణులు భారీ సంఖ్యలో ర్యాలీగా వెళ్లారు. పట్టణంలోని వ్యవసాయమార్కెట్ యార్డు నుంచి పెద్దఎత్తున కార్లు, ద్విచక్రవాహనాలపై టీడీపీ పార్టీ నాయకులు, కార్యకర్తలు, తెలుగు మహిళలు ర్యాలీగావెళ్లి ప్రమాణ స్వీకారం అనంతరం ఆలపాటిని కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

ఆలపాటికి టీడీపీ నాయకుల అభినందనలు

కొల్లిపర, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీగా బాధ్యతలు చేపట్టిన అనంతరం ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను మండల టీడీపీ నాయకులు బుధవారం అమరావతిలో కలిసి అభినందించారు. టీడీపీ మండల అధ్యక్షుడు భీమవరపు చినకోటిరెడ్డి, దుగ్గిరాల మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ వంగా సాంబిరెడ్డి, టీడీపీ జిల్లా కార్యదర్శి కంచర్ల అమృతరాజు, నీటి సంఘం ఉపాధ్యక్షుడు ఆరిమండ శివనాగమల్లేశ్వరరెడ్డి, సీనియర్ నాయకులు గుదిబండి గోవర్ధనరెడ్డి, ఆరిమండ రాధాకృష్ణారెడ్డి, ఆళ్ళ సురేష్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

నల్ల చట్టాన్ని తెచ్చిన మోదీ ప్రభుత్వం: దిలీప్

పొన్నూరు టౌన్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): వక్ఫ్ సవరణ బిల్లు పేరుతో మోదీ ప్రభుత్వం మరో నల్ల చట్టాన్ని తెచ్చిందని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు అందే దిలీప్ బుధవారం ఆరోపించారు. ముస్లిం మనోభావాలను దెబ్బతీయడమే ఆర్ఎస్ఎస్, బీజేపీ ఎజెండా అని ఆరోపించారు. రాజ్యాంగం ఇచ్చిన స్వేచ్ఛను హరించడానికే వక్ఫ్ సవరణ బిల్లు ప్రవేశపెట్టారన్నారు. కాంగ్రెస్ పార్టీ ఈ బిల్లులను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు చెప్పారు. ఎన్డీయే పక్షపాతి పార్టీలైన టీడీపీ, జనసేన ఎన్నికలముందు చేసిన వాగ్దానాలను విస్మరించి ముస్లింలను వంచించారని ఆరోపించారు. వక్ఫ్ సరవణ బిల్లు ప్రజాస్వామ్య మనుగడకు ప్రమాదకరమని అందే దిలీప్ అన్నారు.

అసంపూర్తిగా ఎస్సీ కమ్యూనిటీ హాల్

- 2019లో టీడీపీ ప్రభుత్వ హయాంలో మొదలైన పనులు
- వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత నిలిచిన పనులు
- ఇటీవల చెట్ల తొలగింపు.. బయటపడ్డ నిర్మాణాలు...
- త్వరితగతిన పూర్తిచేయాలని కాలనీవాసుల వినతి



అసంపూర్తిగా నిలిచిపోయిన ఎస్సీ కమ్యూనిటీ హాల్



మొక్కలు తొలగించక ముందు నిర్మాణం పరిస్థితి

పొన్నూరు టౌన్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): పొన్నూరు పట్టణంలో ఎరుకుల వాడలో ఆరేళ్ల క్రితం నిర్మాణం ప్రాంభించిన షెడ్యూల్ తెగల కమ్యూనిటీ హాల్ నిర్మాణం అసంపూర్తిగా నిలిచిపోయింది. పురపాలక సంఘం పరిధిలోని 3వ వార్డులో ఎరుకుల వాడ ఉంది. ఈ ప్రాంతం ప్రజలు తమకు కమ్యూనిటీ హాల్ నిర్మించాలని, అప్పటి, ప్రస్తుత ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్‌కు విజ్ఞప్తి చేశారు. ప్రాథమిక పాఠశాల ప్రాంగణంలో వృథాగా ఉన్న స్థలంలో కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం అనుమతులతో పాటు నిధులు విడుదల చేయించారు. 2019లోనే కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి బేస్‌మెంట్, పిల్లర్లు నిర్మించారు. 2019లో జరిగిన సార్వత్రిక ఎన్నికలలో వైసీపీ విజయం సాధించడంతో కమ్యూనిటీ హాల్ నిర్మాణం ఎక్కడవేసిన గొంగడి అక్కడనే అన్న చందంగా మారింది. వైసీపీ పాలకులు ఎస్సీ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి నిధులు విడుదల చేయకపోవడంతో ఆరేళ్లుగా నిర్మాణం నిలిచిపోయింది. గిరిజనులు అధికంగా నివశించే ఎరుకలవాడలో ప్రజలు వైసీపీ పాలకులను పలుమార్లు కలసి నిధులు విడుదల చేసి కమ్యూనిటీ హాల్ పూర్తిచేయాలని విజ్ఞప్తి చేసినప్పటికీ స్పందన కానరాలేదు. నిర్మాణాలు జరగకపోవడం కమ్యూనిటీ హాల్ వైపు కన్నెత్తి చూడకపోవడంతో కమ్యూనిటీ హాల్ చుట్టూ పెద్దఎత్తున చెట్లు మొలచాయి. గత ఎన్నికల సమయంలో కమ్యూనిటీ హాల్ విషయం ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ దృష్టికి స్థానిక ప్రజలు తీసుకువెళ్లారు. నిరుపేదలుగా జీవిస్తున్న తాము శుభకార్యాలు, సమావేశాల కోసం తమకు ఎటువంటి భవనం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికలలో కూటమి ప్రభుత్వం గెలవడంతో కమ్యూనిటీ హాల్ పూర్తిచేస్తారని ఎరుకులవాడ ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కమ్యూనిటీ హాల్ నిర్మాణాల వద్ద జంగిల్ క్లియరెన్స్ చేయడంతో పాటు పిచ్చి చెట్లను తొలగించడంతో ఆరేళ్లుగా మరుగున పడిపోయిన అసంపూర్తి నిర్మాణాలు బయటకు వచ్చాయి. పాలకులు, అధికారులు స్పందించి ఎస్సీ కమ్యూనిటీ హాల్ నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని ఎరుకుల వాడ ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

రీసర్వేతో భూవివాదాలకు శాశ్వత పరిష్కారం

పెదరావూరు ర్యాలీలో తహసీల్దార్ గోపాలకృష్ణ



పెదరావూరులో ర్యాలీగా వెళుతున్న తహసీల్దార్ గోపాలకృష్ణ, సర్పంచ్ రమాదేవి, ఇతర అధికారులు

తెనాలి రూరల్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం తలపెట్టిన భూముల రీ సర్వేతో భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని తహసీల్దార్ గోపాలకృష్ణ చెప్పారు. బుధవారం మండలంలోని పెదరావూరు గ్రామంలో రీ సర్వే ప్రక్రియపై రైతులకు అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ గోపాలకృష్ణ మాట్లాడుతూ రెవెన్యూ పరంగా అధికంగా రైతులు భూ సమస్యలతో సతమతమవుతున్నారని తెలిపారు. అందుకు ప్రధానంగా వందేళ్ల నాటి భూ రికార్డులు కావడంతో సరైన కొలతలు, హద్దు రాళ్ల లేకపోవడమేనన్నారు. రీ సర్వే ప్రక్రియ ద్వారా పెరిగిన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి సరైన విస్తీర్ణంలో కొలతలు వేయడంతో పాటు హద్దురాళ్లను ఏర్పాటు చేసి డిజిటల్ రికార్డులలో పొందుపరచడం జరుగుతుందన్నారు. దీని ద్వారా హద్దుల సమస్యలు ఉత్పన్నమయ్యే అవకాశం ఉండదని దీంతో రైతుల మధ్య ఘర్షణలు చోటుచేసుకునే అవకాశం పూర్తిగా తగ్గిపోతుందన్నారు. పెదరావూరులో జరుగుతున్న రీ సర్వేకు ప్రతి రైతు అధికారులకు సహకరిస్తూ సంబంధిత పత్రాలను అందించి త్వరితగతిన పూర్తయ్యేలా ముందుకు రావాలని ఆయన కోరారు. గ్రామ సర్పంచ్ కాకి రమాదేవి, పంచాయతీ కార్యదర్శి దానయ్య, వీఆర్వోలు నాగరాజు, భరద్వాజ్, సర్వేయర్లు, ఇతర అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సరిహద్దు డొంక సమస్యపై చర్చలు

తెనాలి రూరల్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): కొలకలూరు- దుగ్గిరాల సరిహద్దుల్లో ఆక్రమణకు గురైన డొంక మార్గాన్ని రైతులతో మాట్లాడి స్వచ్ఛందంగా తొలగించి రాకపోకల సమస్యను పరిష్కరించేలా కృషి చేస్తున్నట్లు తెనాలి, దుగ్గిరాల మండలాల తహసీల్దార్లు కెవీ గోపాలకృష్ణ, ఐ.సునీతలు చెప్పారు. బుధవారం ఆయా గ్రామాల రైతులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. డొంకమార్గం ఆక్రమణలకు గురికావడంతో రైతులు రాకపోకలకు తీవ్ర ఆటంకం కలిగి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. వేలాది ఎకరాలు సాగుభూమి ఉన్నప్పటికీ రాకపోకలకు మార్గం లేకపోవడంతో పలుమార్లు ఆయా ప్రాంతాల రైతులు తహసీల్దార్ కార్యాలయాలకు అర్జీలు ఇచ్చారన్నారు. ఆక్రమణ దారులు స్వచ్ఛందంగా తొలగిస్తే రైతులకు మేలుచేసిన వారవుతారని తెలిపారు. అధికారులకు సహకరించకుంటే శాఖాపరమైన చర్యలతో ముందుకు సాగడం జరుగుతుందని తహసీల్దార్లు తెలిపారు. అనంతరం కొలకలూరు నుంచి ఖాజీపేటకు వెళ్లే బోరునీరు విషయంపై రైతులతో తహసీల్దార్ గోపాలకృష్ణ మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో పలువురు రైతులు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

లాడ్జిల్లో అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తే కఠిన చర్యలు

● త్రీ టౌన్ సీఐ రమేష్‌బాబు



హోటల్ నిర్వాహకులతో మాట్లాడుతున్న సీఐ రమేష్‌బాబు

తెనాలి, మారీసుపేట, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని లాడ్జి, హోటళ్లలో అసాంఘిక కార్యకలాపలాలు నిర్వహిస్తే చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవని త్రీటౌన్ సీఐ ఎస్ రమేష్‌బాబు అన్నారు. బుధవారం స్థానిక త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌లో సీఐ రమేష్ బాబు లాడ్జి, హోటల్ యజమానులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ రమేష్‌బాబు మాట్లాడుతూ లాడ్జి, హోటల్ నందు రూమ్ బుక్ చేసుకున్నవారి వద్ద సరిమైన గుర్తింపు కార్డు ఆధార్, ఓటర్ కార్డు, పాన్ కార్డు లేక డ్రైవింగ్ లైసెన్స్‌లో ఒకటి తప్పకుండా తీసుకోవాలన్నారు. మైనర్లకు పోలీసుల అనుమతి లేనిదే రూమ్స్ ఇవ్వకూడదన్నారు. ప్రతిఒక్కరూ సీసీ కెమోరాలు ఏర్పాటు చేసుకోవాలని, డైలీ రిజిస్టర్ తప్పకుండా నిర్వహించాలని, అనుమానాస్పద వ్యక్తులు వచ్చినపుడు వారి గురించి పోలీసు వారికి తెలియజేయాలన్నారు. లాడ్జి, హోటల్స్ నందు బెట్టింగ్, పేకాట, వ్యభిచారం వంటి అసాంఘిక కార్యకలాపాలను నిర్వహించరాదని హెచ్చరించారు. కార్యక్రమంలో లాడ్జి, హోటల్స్ నిర్వాహకులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన జాతీయ స్థాయి నాటకోత్సవాలు



ది లెసన్ నాటికలోని సన్నివేశం

తెనాలి అర్బన్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): డీఎల్ కాంతారావు పోస్టల్ ఉద్యోగుల కళాపరిషత్ జాతీయ నాటకోత్సవాలు బుధవారం ముగిశాయి. తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రంలో పోస్టల్ ఉద్యోగుల కళాపరిషత్ కళాకారులు ది లెసన్ నాటికను ప్రదర్శించారు. స్నిగ్ధ రచించిన నాటికకు బ్రహ్మాచార్యులు దర్శకత్వం వహించారు. విశాఖపట్నం సాయిని కేతన్ సొసైటీ కళాకారులు శశిరేఖా పరిణయం ప్రదర్శించారు. పోటీలను పరిషత్ అధ్యక్షుడు డీఎల్ కాంతారావు, ప్రధాన కార్యదర్శి బ్రహ్మాచార్యులు, వెలినేని రాఘవయ్య, గరికపాటి సుబ్బారావు, పవన్‌కుమార్ తదితరులు పర్యవేక్షించారు.



నిరసన ప్రదర్శన చేస్తున్న ముస్లింలు

వక్ఫ్ చట్ట సవరణకు మద్దతు ఇవ్వద్దు

తెనాలి అర్బన్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ చట్టానికి చేస్తున్న సవరణకు మద్దతు ఇవ్వవద్దని రాష్ట్ర ఎంపీలను ముస్లిం మైనార్టీలు కోరారు. చట్టసవరణను వ్యతిరేకిస్తూ బుధవారం పట్టణంలో నిరసన ప్రదర్శన చేశారు. అనంతరం ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. రాజ్యాంగం కల్పించిన హక్కులకు వ్యతిరేకంగా వ్యవహరిస్తుందని వెంటనే సవరణను ఉపసంహరించుకోవాలని పలు సంస్థల ప్రతినిధులు డిమాండ్ చేశారు. మజ్లిసుల్ ఉలమా వల్ అయిమ్మా జమియతే ఉలమా హింద్ ఆధ్వర్యంలో జరిగిన ప్రదర్శనలో పలువురు ముస్లింలు పాల్గొన్నారు.

రంగస్థల కళాకారుడు సుబ్రహ్మణ్యంకు ఘన నివాళి

తెనాలి అర్బన్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): రంగస్థల కళాకారుడు దీపాల సుబ్రహ్మణ్యం సంతాపసభ బుధవారం బీసీ కాలనీలోని కళాకారుల సంఘ భవనంలో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సంఘ అధ్యక్షురాలు బుర్రా జయలక్ష్మీ అధ్యక్షతన జరిగిన సభలో సినీ రచయిత సాయిమాధవ్ మాట్లాడుతూ ఎంతో మంది కళాకారులకు శిక్షణ ఇచ్చి కళా రంగానికి ఎనలేని సేవలు చేశారని చెప్పారు. గరికపాటి సుబ్బారావు, ఆదినారాయణ, మధుకర్, రామలింగేశ్వరరావు, వేమూరి విజయభాస్కర్, సింగారావు, తదితరులు పాల్గొన్నారు.



సుబ్రహ్మణ్యం చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న కళాకారులు

పిల్లల సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

● ఆర్‌బీఎస్‌కే స్టేట్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ ప్రశాంత్

తెనాలి రూరల్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): అపుడే పుట్టిన బిడ్డ నుంచి వయసు పెరిగే వరకూ వారి సంరక్షణ బాధ్యతలపై వైద్యులు, తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని రాష్ట్రీయ బాల్ స్వాస్థ్య (ఆర్‌బీఎస్‌కే) స్టేట్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ ప్రశాంత్ అన్నారు. బుధవారం పట్టణంలోని జిల్లా ప్రభుత్వ వైద్యశాల్లో వైద్యులకు, పిల్లల తల్లిదండ్రులకు పిల్లల పెంపక సంరక్షణ కోసం కుటుంబం, సంఘానికి సాధికారత చేకూరే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించి పలు విషయాలను తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌బీఎస్‌కే డిస్ట్రిక్ కో ఆర్డినేటర్ డాక్టర్ రోహిణి, పబ్లిక్ హెల్త్ ప్రొవైడర్ డాక్టర్ రాజన్‌శుక్ల, యుఎన్ఐసీఈఎఫ్ డాక్టర్ శ్రీధర్, ఆసుపత్రి సూపరింటెండెంట్ సౌభాగ్యవాణి, ఆర్ఎంవో మల్లికార్జునరావు, నర్సింగ్ సూపరింటెండెంట్ రాజేశ్వరి, పలువురు పిల్లల వైద్యులు, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ ప్రశాంత్

ఆలపాటి జన్మదిన వేడుకల వీడియో, పోస్టర్ ఆవిష్కరణ

తెనాలి రూరల్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): ఈ నెల 4న ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ పుట్టిన రోజును పురస్కరించుకుని ఐటీడీపీ రూపొందించిన ప్రత్యేక వీడియో, వాల్ పోస్టర్లను బుధవారం వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు ఆవిష్కరించారు. తెనాలి వ్యవసాయమార్కెట్ యార్డులో ఐటీడీపీ సభ్యుల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మల్లవరపు విజయ్‌కుమార్, నరిశెట్టి పవన్, కనికరం యోగేష్, వేమూరి పవన్, కన్నయ్య, వెంకట్, పార్టీ నాయకులు ఖుద్దుస్, వెంకటపూర్ణచంద్ తదితరులు పాల్గొన్నారు



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు



శానిటేషన్ పనులను పరిశీలిస్తున్న మునిసిపల్ చైర్‌పర్సన్ రాధిక తదితరులు

సుందర తెనాలికి సహకరించండి

● మునిసిపల్ చైర్‌పర్సన్ రాధిక

తెనాలి, మారీసుపేట, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): తెనాలి పటణాన్ని సుందర తెనాలిగా తీర్చిదిద్దేందుకు ప్రజల సహకరించాలని మునిసిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక అన్నారు. బుధవారం స్థానిక కొత్తపేట 7వ వార్డులో జరుగుతున్న శానిటేషన్ పనులను మునిసిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక అధికారులతో కలసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా చిట్టాంజనేయ స్వామి గుడి వద్ద ఉన్న జంపని ప్రధాన డ్రెయిన్‌లో జరుగుతున్న పూడికతీత పనులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పట్టణంలో రూ.7వేల కోట్లతో అభివృద్ధి పనులను చేపట్టామన్నారు. అందులో భాగంగానే రూ.60 లక్షలతో డ్రెయిన్లలో సిల్ట్ తొలగింపు కార్యక్రమం చేపట్టామన్నారు. పట్టణ ప్రజల సహకారంతోనే సుందర తెనాలి సాధ్యమౌతుందని అన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ హెలెన్ నిర్మల, టీపీవో సాంబశివరావు, మునిసిపల్ అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



పోటీలను ప్రారంభిస్తున్న గణేష్‌యూత్ కన్వీనర్ మురళి, వెంకట పూర్ణచంద్, ఉప సర్పంచ్ నాగభూషణం, శ్రీనివాస్ తదితరులు

యువత విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించాలి

● గణేష్ యూత్ కన్వీనర్, టీడీపీ నేత వీరవల్లి మురళి

తెనాలి, మారీసుపేట, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): యువత విద్యతో పాటు క్రీడల్లో రాణించి తమ కలలను సాకారం చేసుకోవాలని గణేష్ యూత్ కన్వీనర్, టీడీపీ సీనియర్ నేత వీరవల్లి మురళి అన్నారు. బుధవారం స్థానిక షరాఫ్ బజారులోని శ్రీలక్ష్మీనృసింహ సోమయాజి వైశ్య వ్యాయామ మందిర్‌లో తైక్వాండో అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో 5వ రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలను ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గణేష్ యూత్ కన్వీనర్ వీరవల్లి మురళి, టీడీపీ రాష్ట్ర వాణిజ్య ప్రతినిధి ఈదర వెంకట పూర్ణచంద్, అంగలకుదురు ఉప సర్పంచ్ కనగాల నాగభూషణంలు పాల్గొని తైక్వాండో పోటీలను ప్రారంభించారు. జిల్లా కోచ్ శ్రీనివాస్ మాట్లాడుతూ 13 జిల్లాల నుంచి 250 మంది క్రీడాకారులు పాల్గొంటున్నారని రెండు రోజులు వివిధ క్యాటగిరిలలో పోటీలు నిర్వహిస్తామని ఇందులో ప్రథమస్థానంలో గెలుపొందిన క్రీడాకారులు ఏప్రిల్ 23 నుంచి 27వ తేదీ వరకు మహారాష్ట్ర నాసిక్‌లో జరిగే జాతీయ స్థాయి తైక్వాండో పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర తైక్వాండో అధ్యక్షుడు కృష్ణయ్య, ప్రధాన కార్యదర్శి కె.వెంకటేశ్వరావు, ఆర్గనైజింగ్ కార్యదర్శి కె.శ్రీనివాస్, ఏపీ తైక్వాండో చీఫ్ కోచ్ కె.రోహిత్‌వర్మ, ముప్పవరపు సాంబశివరావు, క్రీడాకారులు పాల్గొన్నారు.

పేదలందరికీ ఉపాధి కల్పించాలన్నదే ప్రభుత్వ లక్ష్యం

● ఎంపీడీవో విజయలక్ష్మి



గ్రామ సభలో మాట్లాడుతున్న ఎంపీడీవో విజయలక్ష్మి

కొల్లిపర, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం ద్వారా పేద ప్రజలందరికీ ఉపాధి కల్పించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని ఎంపీడీవో విజయలక్ష్మి అన్నారు. బుధవారం మండల పరిధిలోని మున్నంగి గ్రామ పంచాయతీ వద్ద అధికారులు ఉపాధిహామీ పథకంపై గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ ఉపాధిహామీ పథకం ద్వారా పేద ప్రజల ఆర్థిక పరిస్థితి మెరుగుపడే అవకాశం ఉందన్నారు. ప్రభుత్వం కూలీల ద్వారా రైతుల సొంత పొలాల్లో పంటల కుంటల ఏర్పాటు చేసుకునే అవకాశం కల్పించినట్లు చెప్పారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అదే విధంగా రైతులు పండ్ల తోటలను వేసుకుంటే పూర్తి సబ్సిడీ సౌకర్యం కల్పించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ వేమూరి దీనమ్మ, ఏపీవో వెంకయ్య, పంచాయతీ కార్యదర్శి మృత్యుంజయరావు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు రాజేంద్ర, సాగర్, నాంచారయ్య, తదితరులు పాల్గొన్నారు.

చిన్నాన్నపై దాడి.. కేసు నమోదు

తెనాలి, మారీసుపేట, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): ఇంటి స్థల వివాదంలో చిన్నాన్నపై కొడుకు దాడి చేసి గాయపర్చిన ఘటనపై కేసు నమోదు చేసినట్టు త్రీటౌన్ పోలీసులు తెలిపారు. త్రీటౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం స్థానిక సుల్తానాబాదుకు చెందిన బాలా నాయక్, అతని అన్న కుమారుడు చంద్రశేఖర్‌నాయక్‌లు పక్కపక్క ఇండ్లలో నివసిస్తున్నారు. గత కొంతకాలంగా వీరికి ఇంటి స్థల విషయంలో గొడవలు జరుతున్నాయి. ఈ క్రమంలో బుధవారం వారిమధ్య స్థలం విషయంలో మాటమాట పెరిగి బాలానాయక్‌పై అతని అన్న కుమారుడు చంద్రశేఖర్ నాయక్ అతని భార్య కర్రలతో దాడి చేయగా రక్తగాయాలయ్యాయి. స్పందించిన కుటుంబ సభ్యులు గాయపడిన బాలానాయక్‌ను వైద్య సేవల కొరకు జిల్లా వైద్యశాలకు తరలించారు. బాధితుడు బాలా నాయక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

ప్రవీణ్ మృతిపై సమగ్ర దర్యాప్తు చేయాలి

● శాంతి ర్యాలీలో పాస్టర్ల అసోసియేషన్ డిమాండ్

తెనాలి రూరల్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతిపై సమగ్ర దర్యాప్తు చేయాలని తెనాలి టౌన్ పాస్టర్స్ అసోసియేషన్ అండ్ మండల పాస్టర్స్ అసోసియేషన్ సభ్యులు డిమాండ్ చేశారు. బుధవారం చెంచుపేట చదలవాడ ఉమేష్ చంద్ర విగ్రహం నుంచి భారీ సంఖ్యలో పాస్టర్లు, సంఘీయులు పెద్దఎత్తున ర్యాలీగా సబ్ కలెక్టర్ కార్యాలయానికి చేరుకుని సంజనసింహకు వినతిపత్రం అందించారు. గాంధీచౌక్, కూరగాయల మార్కెట్ రోడ్డు, రజక చెరువు రోడ్డు, టౌన్‌చర్చ్ వంటి ప్రాంతాల్లో మానవహారంగా నిలుచుని పాస్టర్ ప్రవీణ్ ఆత్మకు శాంతి చేకూరాలని, క్రైస్తవులపై దాడులను ఆపాలని కోరుతూ ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. కార్యక్రమంలో తెనాలి పట్టణ, మండల గ్రామాల పాస్టర్లు ఈరే మినిస్ట్రీస్ అధినేత కె. సుధీర్ కుమార్, తెనాలి టౌన్ చర్చ పాస్టర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కూచిపూడి అబ్రహం, మండల పాస్టర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ భానుప్రసాద్, పాలపర్తి ఐజక్, జాన్‌పాల్, పరంజ్యోతి తదితరులు పాల్గొన్నారు.